

వనమహోత్సవంలో మొక్కలు నాటి నీరు పోస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పక్కన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్, జడ్పీ ఛైర్‌పర్సన్ క్రిస్టినా తదితరులు





ప్రమాణం చేస్తున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, కేంద్ర మంత్రి పెమ్మసాని, కలెక్టర్ నాగలక్ష్మి



అమ్మ పేరుతో.. చెట్టు పెంచండి




● ప్రమాణం చేయించిన విద్యార్థినిని సన్మానించిన చంద్రబాబు, పవన్

రాష్ట్ర ప్రభుత్వం అట్టహాసంగా ప్రారంభించిన వన మహోత్సవం ఉమ్మడి జిల్లాలో కోలాహలంగా జరిగింది. ప్రతి గ్రామంలోనూ ప్రజలు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమాన్ని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మంగళగిరిలోని ఎకో పార్కులో ప్రారంభించారు. మొక్కలు నాటి స్థానిక ప్రజలతో మాట్లాడారు. మంత్రి నాదెండ్ల మనోహర్ తెనాలిలో మొక్కలు నాటారు. అదే విధంగా ఎమ్మెల్యేలు వారి నియోజకవర్గాల్లో మొక్కలు నాటి వన మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు అసలు వన మహోత్సవ కార్యక్రమం సీఎం నరసరావుపేటలో ప్రారంభించాల్సి ఉంది. స్థానిక అధికారులు దానికి తగిన ఏర్పాట్లు చేశారు. అయితే శుక్రవారం వర్షం కారణంగా, అక్కడ కార్యక్రమాన్ని రద్దు చేసి, మంగళగిరిలో నిర్వహించడం గమనార్హం.

● మంగళగిరి ఎకో పార్కుపై సీఎం ప్రశంసల జల్లు
● మేం అడిగితే ఆ చెట్టును చూపించి.. మీ అమ్మపేరు చెప్పండి
● రాజధాని అమరావతిలో అద్భుతమైన గ్రీన్ సిటీగా రూపొందిస్తాం
● సాగర్- శ్రీశైలం మధ్య దేశంలోనే అతిపెద్ద పులుల శాంక్చురీ
● అట్టహాసంగా మంగళగిరి ఎకో పార్కులో వన మహోత్సవం
● ఒక చెట్టు పదిమంది కొడుకులతో సమానం
● ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్
● మొక్క ప్రగతికి చిహ్నం: కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని

గుంటూరు, మంగళగిరి ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): 'మంగళగిరి ఎకో పార్కును చూస్తే ఎంతో ఆనందం కలిగింది. సుందరమైన అడవి.. పక్కనే ప్రతిష్ఠాత్మకమైన ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎయిమ్స్ భవనాలు.. మరో పక్కన బెటాలియన్.. ఇవన్నీ చూస్తే ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణం కనిపిస్తోంది. అమరావతి నడిబొడ్డున ఇలాంటి అద్భుతమైన ఎకో పార్కు వుందంటే చాలా సంతోషంగా వుంది. నేను ఇంట్లో నుంచి బయటకు వస్తే మరో ప్రపంచానికి వచ్చినట్లుంది. ఈ వాతావరణం చూస్తే ఇక్కడే ఇల్లు కట్టుకోవాలనిపిస్తోంది. అంత సుందరంగా, కళ్లకు ఆకర్షణీయంగా ఈ పార్కు కనిపిస్తోంది.' అంటూ మంగళగిరి ఎకో పార్కుపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రశంసల వర్షం కురిపించారు. ఎకో పార్కులో ప్రస్తుతం రోజుకు 300 మంది వస్తున్నారని, రానున్న రోజుల్లో ఆ సంఖ్య 3000కు పెరగాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. భారీ వర్షాల కారణంగా నరసరావుపేట జేఎన్‌టీయూలో జరగాల్సిన కార్యక్రమాన్ని అప్పటికప్పుడు మంగళగిరిలోని ఎకో పార్కులో నిర్వహించారు. అప్పటికప్పుడు ఏర్పాటు కార్యక్రమం అయినప్పటికీ కార్యక్రమం ఎంతో అట్టహాసంగా సాగింది. కార్యాక్రమానికి అర్థగంట ముందే వచ్చిన రాష్ట్ర అటవీశాఖా మంత్రి, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఎకో పార్కులో కలియదిరిగారు. తనను కలవడానికి ప్రయత్నించిన అభిమానులు, ఉభయ పార్టీల కార్యకర్తలతో ఆయన మాట్లాడారు. వారితో కలిసి తిరిగారు.

అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు రావడంతో ఆయనతో కలిసి ఎకో పార్కును పరిశీలించారు. కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, తాడికొండ ఎమ్మెల్యే, అటవీశాఖ అధికారులు, మంగళగిరి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులతో కలిసి ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో సంప్రదాయానికి భిన్నంగా సీఎం, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, స్థానిక ప్రజాప్రతినిధులతో విద్యార్థులు వన మహోత్సవ ప్రమాణం చేయించారు. ప్రమాణం చేయించిన మంగళగిరి మున్సిపల్ హైస్కూలు చిన్నారిని ఆయన, పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తు వారిదే కాబట్టి వారి ద్వారా తాము ప్రమాణం చేశామని ఈ సందర్భంగా చంద్రబాబు చెప్పారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సభలో నవ్వులు పూయించారు. మారిన ముఖ్యమంత్రిగా చమత్కారాలతో అందరినీ అహ్లాదపరుస్తూ విద్యార్థులకు కర్తవ్యాలు బోధించారు. ప్రజలకు తమ బాధ్యతలు గుర్తుచేశారు. గత ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ, వ్యవస్థల విధ్వంసం, వైఫల్యాలపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రజలకు, ప్రధానంగా చిన్నారులకు మంచి భవిష్యత్తును హామీ ఇచ్చారు.



తల్లి రుణం తీర్చుకునేందుకు ఇదో అవకాశం

ఈ రోజు నుంచే ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటండి.. ఆ మొక్కకు తల్లిపేరు పెట్టండి. మనకు జన్మనిచ్చిన తల్లి రుణం తీర్చుకునేందుకు ఇది ఒక మంచి అవకాశం. నేను పవన్ కల్యాణ్ మళ్లీ మీ దగ్గరకి వస్తాం. అప్పుడు మీరు నాటిన మొక్కను మాకు చూపించాలి. పేరు అడిగితే మీ అమ్మపేరు చెప్పాలని చంద్రబాబు వన మహోత్సవం సందర్భంగా చిన్నారుల వద్ద హామీ తీసుకున్నారు. గత ముఖ్యమంత్రిలాగా రాళ్ల మీద తన బొమ్మ వేసుకోబోమని ఎద్దేవా చేశారు. ఎవరు నాటిన మొక్కకు వారే తమ తల్లి పేరు పెట్టుకోవచ్చని చమత్కరించారు. రాష్ట్రంలోని ప్రతి ఒక్కరూ రెండేసి మొక్కలు నాటితే ఏడాదికి పది కోట్ల మొక్కలు అవుతాయన్నారు. తద్వారా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సంకల్పించినట్లు 50 శాతం పచ్చదనాన్ని సాధించవచ్చన్నారు. ఆ కార్యక్రమాన్ని ఈ ఏడాది కోటి మొక్కలతో ప్రారంభిస్తున్నామన్నారు. తద్వారా ఏడాదికి 0.33 శాతం పచ్చదనం పెరుగుతుందని చెప్పారు. ఇప్పుడు రాష్ట్రంలో 32 కమ్యూనిటీ ఆధారిత ఎకోటూరిజం సెంటర్లు, 175 నియోజకవర్గాల్లో జపనీస్ టెక్నాలజీ, నరేగా డబ్బులు వినియోగించి నగర వనాలను నిర్మిస్తామన్నారు. తద్వారా పవన్ కల్యాణ్ చెప్పినట్లు 50 శాతం పచ్చదనం వస్తుందన్నారు. అదే అసలైన స్వర్ణాంధ్రప్రదేశ్ అన్నారు. పవన్ కల్యాణ్‌కు నిధుల కొరత లేదని, ఆయన చేతిలో నరేగా, అటవీ శాఖలు వున్నాయని, వాటి అనుసంధానంతో అడవుల పెంపకం ఎంతో సులువవుతుందన్నారు. ఇలాంటి మా కొత్త ఆలోచనలను కేంద్ర మంత్రి పెమ్మసాని సాకారం చేసే దిశగా కేంద్రంలో కృషి చేయాలన్నారు. నగర వనాల నిర్మాణాల్లో భాగమయ్యేందుకు ముందుకు వచ్చేవారి సహాయం తీసుకుంటామన్నారు.

● పులులను చూడాలంటే పవన్ కల్యాణ్‌ను అడగాల్సిందే..

నాగార్జున సాగర్, శ్రీశైలం దగ్గర 5,300 ఎకరాల్లో దేశంలోనే అతిపెద్ద పులుల శాంక్చురి వస్తుందని చంద్రబాబు చెప్పారు. అక్కడ 80 పులులు వుంటాయని, అద్భుతమైన సఫారీని నిర్మిస్తామని ఆయన తెలిపారు. పులులను చూడాలంటే ఎక్కడికో వెళ్లాల్సిన పనిలేదని నాగార్జున సాగర్ వెళ్లి పవన్ కల్యాణ్‌ను తలుచుకుంటే చాలని చమత్కరించారు. రాష్ట్రంలో 13 వన్యప్రాణి సంరక్షణ కేంద్రాలు, మూడు నేషనల్ పార్కులు, రెండు జూలాజికల్ పార్కులు వున్నాయని, ఒక టైగర్ పార్కు, ఒక ఏనుగుల శాంక్చురి వచ్చే అవకాశం వుందని చెప్పారు.



ఒక చెట్టు పది మంది కొడుకులతో సమానం: డిప్యూటీ సీఎం పవన్

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మాట్లాడుతూ అటవీ శాఖ మంత్రిగా తనకు ఈ కార్యక్రమం చేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. వరుణ దేవుడు కూడా తన శుభాశీస్సులు అందించారన్నారు. హరితాంధ్రప్రదేశ్ సాధించడం, పర్యావరణాన్ని పరిరక్షించడం తన బాధ్యత అన్నారు. చెట్లు నరకడం తేలికే.. పెంచడం కష్టమన్నారు. గత ముఖ్యమంత్రి వందల చెట్లు నరికేశాడని, తాము అలా కాదన్నారు. ప్రతి దేవాలయం, మసీదు, చర్చి, ప్రభుత్వ కార్యాలయాల్లో మొక్కలు పెంచుతామన్నారు. ఒక చెట్టు పది మంది కొడుకులతో సమానమని అరణ్యసూక్తం చెప్పిందన్నారు. అందుకే ప్రతి ఒక్కరూ చెట్టును పెంచే బాధ్యత తీసుకోవాలన్నారు. జపాన్‌కు చెందిన మియావకి పద్ధతిలో అనతి కాలంలోనే దట్టమైన అడవులు పెంచవచ్చని, ఆ పుస్తకాలను అందరికీ అందుబాటులోకి తెస్తామన్నారు. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ విత్తనం నాటిన తరువాత అది ఎన్నో అవాం తరాలను అధిగమించి మొక్కై, మహా వృక్షమై ఎదుగుతుందన్నారు. అది ప్రగతికి చిహ్నమన్నారు. కార్యక్రమంలో అటవీశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవి చౌదరి, అటవీశాఖ ముఖ్య కార్యదర్శి అనంతరామ్, కలెక్టర్ నాగలక్ష్మి, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, గుంటూరు జెడ్పీ ఛైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా, టీడీపీ నేత తమ్మిశెట్టి జానకి, స్థానిక ప్రజలు, విద్యార్థిని విద్యార్థులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

ఒక రోజు ముందే పింఛన్లు



● అవ్వాతాతల ఆనందం ● పల్నాడు జిల్లాలో 2,78,219 పింఛన్‌లు ● పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

నరసరావుపేట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లా అంతటా పింఛన్‌ల పంపిణీ ఒక రోజు ముందే జరగనున్నది. ఇందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. గ్రామ, వార్డు సచివాలయాల వారీగా పింఛన్ సొమ్మును సిద్ధం చేశారు. నేటి ఉదయం 6 గంటల కల్లా ప్రారంభం కానున్నది. ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము అందజేస్తారు. సాయంత్రం కల్లా జిల్లాలో నూరు శాతం పింఛన్‌లను పంపిణీ లక్ష్యంగా నిర్ణయించారు. జిల్లాలో 2,78,219 మంది పింఛన్ దారులు ఉండగా రూ 118.34 కోట్లు నగదు పంపిణీ చేయనున్నారు. గత నెలలో పల్నాడు జిల్లా పింఛన్ పంపిణీలో ముందు వరుసలో నిలిచింది. ఈ నెలలో కూడా ఇదే స్థాయిలో పింఛన్‌ల పంపిణీ చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఇంటి వద్దనే పింఛన్ ఒక రోజు ముందే పంపిణీ చేస్తున్నారన్న సమాచారంతో అవ్వా తాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యేలు వారి వారి నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, అధికారులు పింఛన్ పంపిణీలో పాల్గొనున్నారు. ముందు గానే పింఛన్ పంపిణీ చేస్తున్నట్టు ప్రచారం నిర్వహించారు. ఈ మేరకు పింఛన్ పంపిణీపై కలెక్టర్ అరుణ్‌బాబు జిల్లా అధికారులతో సమీక్షించారు. 1వతేదీ ఆదివారం కావడంతో ఒక రోజు ముందే పింఛన్ పంపిణీ చేస్తున్నట్టు లబ్ధిదారులకు సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు.

రైల్ ఓవర్ రైల్‌కు గ్రీన్ సిగ్నల్

● బొమ్మైపల్లి - బీబీనగర్ స్టేషన్లను కలుపుతూ 8.54 కి.మీ నిర్మాణం
● రూ.281 కోట్ల నిధులు అవసరమౌతాయని అంచనా
● బడ్జెట్‌లో రూ.20 కోట్ల కేటాయింపు

7లో..

పల్నాడు ప్రత్యేక అధికారిగా.. రేఖా రాణి

నరసరావుపేట, ఆగస్టు 30 : జిల్లా ప్రత్యేక అధికారిగా జీ రేఖా రాణిని ప్రభుత్వం నియమించింది. ఈమేరకు శుక్రవారం ఉత్తర్వులు విడుదలయ్యాయి. 2008 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన రాణి హ్యాండ్ లూమ్స్, టెక్స్‌టైల్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో అమలు జరుగుతున్న ప్రభుత్వ కార్యక్రమాలను ఆమె పర్యవేక్షిస్తారు. ప్రగతి పనుల పురోగతి, సంక్షేమ పథకాల అమలు తీరును ఎప్పటికప్పుడు రేఖారాణి సమీక్షిస్తారు.



తెల్లబంగారం.. సాగుకు దూరం

● భారీగా తగ్గిన పత్తి సాగు
● పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో 49 శాతానికి పడిపోయిన పత్తి విస్తీర్ణం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

తెల్లబంగారం.. పత్తి సాగు వెలవెలబోయింది. ప్రకృతి సహకరించకపోవడంతో సాగు విస్తీర్ణం రికార్డు స్థాయిలో తగ్గింది. గత పదేళ్లలో ఎన్నడూ లేని విధంగా దీని సాగు తగ్గడం గమనార్హం. గిట్టుబాటు కాకపోతుండటంతో రైతులు పత్తి సాగుకు ఆసక్తి చూపడంలేదు. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో 49 శాతానికి పత్తి సాగు పడిపోయింది. ఈ మూడు జిల్లాల్లో 2.08 లక్షల ఎకరాలకే సాగు పరిమితమైంది. ఖరీఫ్‌లో పత్తి సాగు సమయం ముగిసిందని వ్యవసాయ శాఖ అధికారులు చెప్పడంతో, ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు దృష్టి సారించిన పరిస్థితి.

రాష్ట్రంలో కర్నూలు జిల్లా తర్వాత అత్యధికంగా పత్తి సాగు అయ్యే జిల్లా పల్నాడు. ఇక్కడ ఈ సాగు దారుణంగా పడిపోయింది. వర్షాలు కురిసినప్పటికీ పత్తి సాగుకు రైతులు ఆసక్తి చూపడం లేదు. పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల్లో పత్తి సాధారణ విస్తీర్ణం 3.45 లక్షల ఎకరాలు. 2.08 లక్షల ఎకరాల్లో మాత్రమే పత్తి సాగైంది. సాధారణ విస్తీర్ణకం కన్నా 1.37 లక్షల ఎకరాల్లో సాగు తగ్గింది. గుంటూరు జిల్లాలో సాధారణ విస్తీర్ణంలో 71 శాతమే.. 47,840 ఎకరాల్లో, బాపట్ల జిల్లాలో అయితే సాధారణ విస్తీర్ణంలో కేవలం 25 శాతమే.. సాధారణ విస్తీర్ణం 10,515 ఎకరాలు కాగా 2,623 ఎకరాల్లో, పల్నాడు జిల్లాలో సాధారణ విస్తీర్ణం 2,67,965 ఎకరాలు. 1,35,845 ఎకరాల్లో పత్తి సాగైంది.

పెట్టుబడి పెరిగింది..గిట్టుబాటు తగ్గింది

పత్తి సాగు పెట్టుబడి ఏటేటా గణనీయంగా పెరుగుతోంది. దీనికి తోడు గులాబి రంగు పురుగు, చీడపీడల కారణంగా దిగుబడులు తగ్గుతున్నాయి. ఎకరాకు సగటున ఆరు నుంచి ఏడు క్వింటాళ్ల పత్తి దిగుబడి అవుతోంది. మార్కెట్‌లో మద్దతు ధర కూడా దక్కడం లేదు. కౌలు రైతులకు అయితే పత్తి గిట్టుబాటు కావడంలేదు. దీంతో పత్తికి ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు దృష్టి సారించారు. ఈ ఏడాది సాగర్ కాలువలకు పుష్కలంగా సాగు నీరు సరఫరా చేస్తుండటంతో లోతట్టు పొలాల్లో పత్తికి బదులుగా వరిసాగు చేస్తున్నారు. కంది, మొక్క జొన్న, శనగ పంటల వైపు పత్తి రైతులు దృష్టి సారించారు.

పత్తి పరిశ్రమపై తీవ్ర ప్రభావం

గణనీయంగా పత్తిసాగు తగ్గుతుండటంతో దిగుబడులు భారీగా తగ్గనున్నాయి. సాధారణ విస్తీర్ణం కన్నా 1.37 లక్షల ఎకరాల్లో సాగు తగ్గింది. దీని ప్రకారం ఎకరాకు సగటున 7 క్వింటాళ్ల దిగుబడి ప్రకారం లెక్కిస్తే 10,96,000 క్వింటాళ్ల పత్తి దిగుబడి తగ్గనుంది. మూడు జిల్లాల్లో పత్తి ఆధారిత పరిశ్రమలు అధికంగా ఉన్నాయి. సాగు తగ్గుతుండటంతో పరిశ్రమల్లో పనిచేసే కార్మికుల ఉపాధిపైనా దీని ప్రభావం చూపనుంది. పత్తి ఆధారిత పరిశ్రమలు కుదేలవుతాయేమోనని సంబందిత పరిశ్రమల నిర్వాహకులు ఆందోళన చెందుతున్నారు.

మిలిటరీ స్కూళ్లలో 6, 9వ తరగతుల్లో ప్రవేశాలు



దేశవ్యాప్తంగా ఉన్న రక్షణ మంత్రిత్వశాఖ పరిధిలోని రాష్ట్రీయ మిలిటరీ పాఠశాలల్లో 2025-2026 విద్యా సంవత్సరానికి గాను ఆరో తరగతిలో ప్రవేశానికి సంబంధించిన కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ నోటిఫికేషన్ విడుదలైంది. ఈ ఎంట్రెన్స్ టెస్ట్‌లో వచ్చిన మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు.

మిలిటరీ స్కూళ్లు ఉన్న ప్రాంతాలు, వాటి వివరాలు: చైల్(హిమాచల్ ప్రదేశ్), అజ్మీర్(రాజస్థాన్), ధోల్‌పూర్(రాజస్థాన్), బెల్గాం(కర్ణాటక), బెంగళూరు(కర్ణాటక). రాష్ట్రీయ మిలిటరీ పాఠశాలల్లో ఆరో తరగతి నుంచి పన్నెండో తరగతి వరకు బాలబాలికలకు విద్యా బోధన ఉంటుంది. వీటిలో రక్షణ విభాగాల సిబ్బంది పిల్లలు, ఇతర వర్గాల పౌరుల పిల్లలు చదువుకోవచ్చు. ఈ పాఠశాలలను రక్షణ మంత్రిత్వ శాఖ నిర్వహిస్తుంది. ఇవి ఆంగ్ల మాధ్యమంలో నడిచే రెసిడెన్షియల్ పబ్లిక్ పాఠశాలలు.

- రాష్ట్రీయ మిలిటరీ స్కూల్స్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(సెట్) 2025-26

అర్హతలు: 6వ తరగతిలో ప్రవేశం పొందడానికి ప్రభుత్వ/ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాల నుం చి 5వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. ప్రస్తుత విద్యా సంవత్సరం 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

▼ 9వ తరగతిలో ప్రవేశం కోరే విద్యార్థులు ప్రభుత్వ/ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాల నుం చి 8వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. ప్రస్తుత విద్యా సంవత్సరం 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

వయోపరిమితి: 6వ తరగతిలో ప్రవేశం పొందడానికి 2025 మార్చి 31 నాటికి విద్యార్థి వయస్సు 10 నుంచి 12 ఏళ్ల మధ్య ఉండాలి. అంటే 2010 ఏప్రిల్ 1 నుంచి మార్చి 2012 మార్చి 31 మధ్య జన్మించి ఉండాలి.

రిజర్వేషన్: రక్షణ విభాగాల సిబ్బంది పిల్లలు, అలాగే, ఇతర వర్గాల పౌరుల పిల్లలకు మాత్రమే కేటాయించారు.

ఎంపిక ప్రక్రియ: రక్షణ మంత్రిత్వ శాఖ నిర్వహించే కామన్ ఎంట్రెన్స్ టెస్ట్, ఇంటర్వ్యూ, మెడికల్ ఫిట్‌నెస్, ఇతర రిజర్వేషన్లను అనుసరించి సీటు కేటాయిస్తారు.

ప్రవేశ పరీక్ష: పరీక్షలో మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు.

పరీక్ష సబ్జెక్టులు

6వ తరగతి: ఇంటెలిజెన్స్(50 మార్కులు), జనరల్ నాలెడ్జ్ అండ్ కరెంట్ అఫైర్స్(50 మార్కులు), మేథ్స్(50 మార్కులు), ఇంగ్లీష్(50 మార్కులు). 5వ తరగతి స్థాయిలో ప్రశ్నలు అడుగుతారు. ఇంటర్వ్యూకు 20 మార్కులు.

9వ తరగతి: ఇంగ్లీష్(50 మార్కులు), హిందీ(20 మార్కులు), సోషల్ సైన్స్(30 మార్కులు), మేథ్స్(50 మార్కులు), సైన్స్(50 మార్కులు). 8వ తరగతి స్థాయిలో ప్రశ్నలు అడుగుతారు. ఇంటర్వ్యూకు 50 మార్కులు ఉంటాయి.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 19

వెబ్‌సైట్: www.rashtriyamilitaryschools.edu.in/

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్‌ఎల్ https://ejyothy.com/nuz8UXzలో చదవండి.

దిక్సూచి DIKSUCHI



ఆంధ్ర యూనివర్సిటీలో పీజీ

విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్(ఏయూడీఓఏ)- పీజీ ప్రోగ్రామ్‌లలో సెల్ఫ్ సపోర్ట్ కేటగిరీ సీట్ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ తదితర ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఏపీ పీజీసెట్ 2024 ర్యాంక్ ఆధారంగా వర్సిటీ నిర్వహించే కౌన్సెలింగ్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. అడ్మిషన్ పొందిన అభ్యర్థులకు ఫీ రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు లభించవు.

కోర్సులు-స్పెషలైజేషన్‌లు

- **ఎంఏ:** ఇంగ్లీష్, తెలుగు, హిందీ, కూచిపూడి క్లాసికల్ డ్యాన్స్, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, సోషియాలజీ, సోషల్ వర్క్, యోగా, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, అప్లయిడ్ ఎకనామిక్స్, ఎకనామిక్స్, మేథమెటిక్స్
- **ఎంఎఫ్ఏ:** స్కల్ప్‌చర్, పెయింటింగ్, ప్రింట్ మేకింగ్
- మాస్టర్ ఆఫ్ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్(ఎంహెచ్ఆర్ఎం)
- మాస్టర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్(ఎంఎల్ఐఎస్సీ)
- మాస్టర్ ఆఫ్ కామర్స్(ఎంకాం)
- మాస్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్(ఎంపీఈడీ)

ఎమ్మెస్సీ: బయోకెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, మెరైన్ బయాలజీ అండ్ ఫిషరీస్, కోస్టల్ ఆక్వా కల్చర్ అండ్ మెరైన్ బయోటెక్నాలజీ, మెరైన్ బయోటెక్నాలజీ, మైక్రోబయాలజీ, హ్యూమన్ జెనెటిక్స్, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, హోమ్ సైన్స్(ఫుడ్, న్యూట్రిషన్, డైటెటిక్స్), బోటనీ, జువాలజీ, అప్లయిడ్ మేథమెటిక్స్, మేథమెటిక్స్, స్టాటిస్టిక్స్, ఫిజిక్స్, న్యూక్లియర్ ఫిజిక్స్, మెరైన్ జియోఫిజిక్స్, జియోఫిజిక్స్, ఫిజికల్ ఓషనోగ్రఫీ, మెటరాలజీ, అనలిటికల్ కెమిస్ట్రీ, ఇనార్గానిక్ కెమిస్ట్రీ, కెమిస్ట్రీ అండ్ అనాలిసిస్ ఆఫ్ ఫుడ్, ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఫిజికల్ కెమిస్ట్రీ, జియాలజీ, అప్లయిడ్ జియాలజీ, సైకాలజీ, జాగ్రఫీ, అప్లయిడ్ కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్

ముఖ్య సమాచారం

- **రిజిస్ట్రేషన్ ఫీజు:** రూ.1000
- **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 4
- **కౌన్సెలింగ్ తేదీ:** సెప్టెంబరు 5
- **కౌన్సెలింగ్ వేదిక:** డైరెక్టర్, డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్, విజయనగర్ ప్యాలెస్, పెదవాల్తేర్, విశాఖపట్నం
- **వెబ్‌సైట్:** www.audoa.andhrauniversity.edu.in

వెటర్నరీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో
బీవీఎస్సీ & ఏహెచ్

ఐకార్ ఆధ్వర్యంలోని ఇండియన్ వెటర్నరీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(ఐవీఆర్ఐ)- బీవీఎస్సీ & ఏహెచ్ డిగ్రీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఈ ప్రోగ్రామ్ వ్యవధి అయిదున్నరేళ్లు. ఇందులోనే ఏడాది పాటు కంపల్సరీ రొటేటింగ్ ఇంటర్న్‌షిప్ కూడా ఉంటుంది. మొత్తం 50 సీట్లు ఉన్నాయి. వీటిలో 45 రెగ్యులర్ సీట్లు, 8 పేమెంట్ సీట్లు(సూపర్ న్యూమరరీ) ఉన్నాయి. వీటిని నీట్ యూజీ 2024 ర్యాంక్ ఆధారంగా భర్తీ చేస్తారు. ఎన్ఆర్ఐ కోటా కింద రెండు సీట్లు(సూపర్ న్యూమరరీ) ప్రత్యేకించారు. వీటిని అభ్యర్థుల అకడమిక్ మెరిట్ ఆధారంగా భర్తీ చేస్తారు. మిగిలిన అయిదు సీట్లను రోస్టర్ విధానంలో వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా భర్తీ చేస్తుంది. ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్‌లు వర్తిస్తాయి.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ/బయోటెక్నాలజీ, ఇంగ్లీష్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి. గ్రూప్ సబ్జెక్టుల్లో మొత్తమ్మీద కనీసం 50 శాతం మార్కులు ఉండాలి. నీట్ యూజీ 2024 అర్హత పొందాలి. ఇందులో నిర్దేశించిన కటాఫ్ కంటే ఎక్కువ మార్కులు తప్పనిసరి. 2024 డిసెంబరు 31 నాటికి అభ్యర్థుల వయసు 17 ఏళ్లు నిండి ఉండాలి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 6
- **మొదటి రౌండ్ కౌన్సెలింగ్‌కు ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** సెప్టెంబరు 18
- **మొదటి రౌండ్ కౌన్సెలింగ్ తేదీ:** సెప్టెంబరు 26
- **రెండో రౌండ్ కౌన్సెలింగ్‌కు ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** సెప్టెంబరు 27
- **రెండో రౌండ్ కౌన్సెలింగ్ తేదీ:** అక్టోబరు 7
- **కోర్సు ప్రారంభం:** అక్టోబరు 1 నుంచి
- **వెబ్‌సైట్:** ivri.nic.in

నవ్య | చిత్రజ్యోతి

ఇక్కడ కూడా అలాంటి కమిటీ వేయాలి



మాలీవుడ్‌లో కొనసాగుతున్న కీచకుల అకృత్యాలను బయట పెట్టిన జస్టిస్ హేమ కమిటీ రిపోర్ట్‌ను హీరోయిన్ సమంత స్వాగతించిన విషయం తెలిసిందే. తెలుగు చిత్ర పరిశ్రమలోని లైంగిక వేధింపులపై తెలంగాణ ప్రభుత్వం కూడా దృష్టి సారించాలనీ, జస్టిస్ హేమ కమిటీ తరహాలో ఇక్కడ కూడా ఓ కమిటీ వేయాలని సమంత కోరారు. వేధింపులకు గురి కాకుండా తమ ప్రతిభను ప్రదర్శించే అవకాశం అప్పుడే మహిళా ఆర్టిస్టులకు ఉంటుందని ఆమె పేర్కొన్నారు. 'తెలుగు చిత్రపరిశ్రమలో మహిళలుగా మేమంతా జస్టిస్ హేమ కమిటీ రిపోర్ట్‌కు స్వాగతం పలుకుతున్నాం. అలాగే కీచకులపై పోరాటం చేస్తున్న డబ్ల్యూసీసీ చర్యలను అభినందిస్తున్నాం. మాలీవుడ్‌లో మహిళల హక్కుల కోసం డబ్ల్యూసీసీ విజయవంతమైన పోరాటం చేసింది' అని సమంత అన్నారు.

బాలకృష్ణ స్వర్ణోత్సవ సభకు అతిరథమహారథులు



నందమూరి బాలకృష్ణ నటుడిగా 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా తెలుగు చలనచిత్ర పరిశ్రమ ఆధ్వర్యంలో స్వర్ణోత్సవ వేడుకలు ఘనంగా జరుగనున్నాయి. సెప్టెంబర్ ఒకటిన నోవాటెల్ హోటల్‌లో ఈ వేడుకలకు అతిరథమహారథులు హాజరవుతున్నారు. ఇప్పటికే ఎంతో మందికి ఆహ్వానాన్ని అందించారు. ఇంకా కొంతమందికి పిలుపులు వెళ్లలేదని వస్తున్న వార్తలపై శుక్రవారం సాయంత్రం తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ప్రెస్‌మీట్ ఏర్పాటు చేసి క్లారిటీ ఇచ్చింది. కార్యదర్శి దామోదర ప్రసాద్ మాట్లాడుతూ 'తెలుగు చిత్రపరిశ్రమలోని అన్ని శాఖలు కలసి ఈ వేడుకల్ని నిర్వహిస్తున్నాయి. రెండు తెలుగు రాష్ట్రాల మంత్రులు, కేంద్రమంత్రులు కూడా కార్యక్రమంలో పాల్గొంటారు. ఇతర భాషల సినీ ప్రముఖులు కూడా వస్తారు. ఫిజికల్‌గా ఎవరికైనా ఇన్విటేషన్ అందకపోయినా ఇదే మా వ్యక్తిగత ఆహ్వానంగా భావించి ప్రతి ఒక్కరూ పాల్గొనాలి' అని కోరారు. ఈ కార్యక్రమంలో చదలవాడ శ్రీనివాసరావు, సి.కల్యాణ్, మాదాల రవి, భరత్‌భూషణ్, ప్రసన్నకుమార్, శివబాలాజీ, పరుచూరి గోపాలకృష్ణ, అశోక్‌కుమార్, మాధవపెద్ది సురేశ్, అనిల్‌కుమార్ వల్లభనేని తదితరులు పాల్గొన్నారు.

చిరంజీవి సినిమాలో నటిస్తున్నా



● చిక్కబళ్లాపుర ఎమ్మెల్యే ప్రదీప్ ఈశ్వర్

మెగాస్టార్ చిరంజీవితో కలసి సినిమాలో నటించే అవకాశం లభించనుందని కర్ణాటక రాష్ట్రం చిక్కబళ్లాపుర కాంగ్రెస్ ఎమ్మెల్యే ప్రదీప్ ఈశ్వర్ తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, మెగాస్టార్ చిరంజీవికి తాను పెద్ద అభిమానినని అన్నారు. ఆయనకు తనపై ప్రేమ ఉందని అన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచినప్పుడు హైదరాబాద్‌లోని ఇంటికి పిలిపించి సన్మానం చేశారని అన్నారు. పవన్ కల్యాణ్ గెలిచినప్పుడు తాను ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలిపానని అన్నారు. ప్రస్తుతం చిరంజీవి 'విశ్వంభర' సినిమా చేస్తున్నారని, అది ముగిశాక ప్రారంభమయ్యే మరో సినిమాలో తాను నటిస్తానని తెలిపారు. తన పాత్ర ఏమిటనేది భవిష్యత్తులో తెలుస్తుందని అన్నారు.

బెంగళూరు (ఆంధ్రజ్యోతి)

శ్రీరంగపురంలో కల్యాణం



వనపర్తి జిల్లా శ్రీరంగపురంలోని రంగనాథ స్వామి ఆలయం మా కుటుంబానికి చాలా ప్రత్యేకం. సిద్ధార్థ్‌తో నా నిశ్చితార్థం అక్కడే జరిగింది. త్వరలో మా పెళ్లి కూడా అక్కడే జరుగుతుంది' అని కథానాయిక అదితీ రావ్ హైదరీ చెప్పారు. మార్చిలో వారిద్దరికీ నిశ్చితార్థం జరిగిన విషయం తెలిసిందే. తమ ప్రేమ, పెళ్లి గురించి అదితీ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. పెళ్లి తేదీని పెద్దలు నిర్ణయిస్తారు, మేం ఇద్దరం కలసి ప్రకటిస్తామని చెప్పారు. 'మహాసముద్రం' సినిమా చిత్రీకరణ సమయంలో సిద్ధార్థ్, అదితీ ప్రేమలో పడ్డారు.

అవసరమైతే కోర్టుకు వెళ్తా



బాలీవుడ్ నటి, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ నటించిన 'ఎమర్జెన్సీ' చిత్రం విడుదల ముంగిట వివాదాల్లో చిక్కుకుంది. ఈ సినిమాను నిషేధించాలంటూ పలు సిక్కు సంఘాల నుంచి డిమాండ్లు వస్తున్నాయి. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ విధించిన అత్యయిక పరిస్థితి ఆధారంగా రూపుదిద్దుకున్న చిత్రమిది. ఇందిరా గాంధీ పాత్రను పోషించడంతో పాటు కంగనే ఈచిత్రానికి దర్శకత్వం వహించారు. సెప్టెంబర్ 06న 'ఎమర్జెన్సీ'ని ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు కంగన సన్నాహాలు చేశారు. అయితే ఇప్పుడు ఈ చిత్రం విడుదల సందిగ్ధంలో పడింది. తమ చిత్రానికి సెన్సార్ సర్టిఫికెట్ ఇవ్వడం లేదని కంగన ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. సినిమాను విడుదల చేసేందుకు అవసరమైతే న్యాయపోరాటం చేస్తానని ఆమె చెప్పారు. సినిమాలను విడుదల చేస్తే చంపేస్తామంటూ వస్తున్న బెదిరింపుల గురించి మాట్లాడుతూ 'నన్ను భయపెట్టాలని చూసినంత మాత్రాన చరిత్ర మారిపోదు కదా' అని కంగన అన్నారు. సంజయ్ గాంధీ పాత్ర పోషించిన విశాక్ నాయర్‌కు సైతం బెదిరింపులు వచ్చాయి.



అభిమానుల ప్రేమకు ఆనంద భాష్పాలు

అభిమానుల ప్రేమలో తడిసి ముద్దయ్యారు హాలీవుడ్ స్టార్ హీరోయిన్ ఏంజెలీనా జోలీ. వెనీస్ ఫిల్మ్‌ఫెస్టివల్‌లో ఆమె నటించిన 'మరియ' చిత్రం ప్రత్యేక ప్రదర్శనకు హాజరయ్యారు. షో పూర్తవ్వగానే అందరూ లేచి నిలబడి కరతాళ ధ్వనులతో ఆమె నటనను అభినందించారు. దాదాపు ఎనిమిది నిమిషాల పాటు థియేటర్ అంతా మార్మోగింది. తనపై అభిమానులు చూపుతున్న ప్రేమతో ఉద్వేగానికి లోనైన ఏంజెలీనా కన్నీళ్లను ఆపలేకపోయారు. సహనటుడు ఫియర్స్ ఫావినో ఆమెను సముదాయించారు. అభిమానులకు ఏంజెలీనా ధన్యవాదాలు తెలిపారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవడంతో ఎన్నో కష్టాలు అనుభవించి ఆమె ఈ స్థాయికి చేరుకున్నారు అని అభిమానులు ఏంజెలినాను ప్రశంసిస్తున్నారు.



ఇటీవల కర్నాటకలోని కూర్గ్‌లో వివాహం చేసుకుని ఒక్కటైన కిరణ్ అబ్బవరం, రహస్య గోరఖ్ రిసెప్షన్ శుక్రవారంహైదరాబాద్‌లో జరిగింది. పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు.

టీవీ రంగంలోనూ లైంగిక వేధింపులు

● సీనియర్ నటి కుట్టిపద్మిని



తమిళ చిత్రసీమతోపాటు టీవీ రంగంలోనూ మహిళలపై లైంగిక వేధింపులకు కొదువలేదని సీనియర్ నటి కుట్టిపద్మిని ఆరోపించారు. ఓ తమిళ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ.. సినిమాల్లోనే కాదు టీవీ సీరియల్స్‌లో నటించే యువతులు కూడా లైంగిక వేధింపులకు గురవడం సహజంగా మారిపోయింది. అలా వేధింపులకు గురయ్యేవారు సమాజానికి భయపడి ఎవరికీ ఫిర్యాదు చేయడం లేదు. పారితోషికాలు పెద్ద మొత్తంలో లభిస్తుండటంతో కొంతమంది ఈ లైంగిక వేధింపులను భరిస్తున్నారు. ఫిర్యాదు చేసేవారికి మళ్లీ సినిమాల్లో నటించే అవకాశాలు లభించడం లేదు. నటుడు సురేశ్ గోపీపై వస్తున్న ఆరోపణలకు ఆధారాలు ఎక్కడున్నాయంటూ కొంతమంది అడుగుతున్నారు, ఆధారాలు ఎవరిస్తారు?' అని ఆమె ప్రశ్నించారు. దీనికి సీబీఐ విచారణ లాగా లై డిటెక్టర్లతో పరీక్షల చేయడం మినహా మరో మార్గం లేదన్నారు. దర్శకులు, సాంకేతిక నిపుణుల నుండి మహిళలు లైంగిక వేధింపులకు గురవుతూనే ఉన్నారని, అవి భరించలేక ఎంతోమంది ఆత్మహత్యలు కూడా చేసుకున్నారని కుట్టి పద్మిని పేర్కొన్నారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

మంచి బ్రేక్ కోసం ఎదురు చూస్తున్నా



తెలుగు సినిమాల్లో తండ్రి పాత్రలు దాదాపు ఒకేలా ఉంటున్నాయి. అయినా తనకు ఇచ్చిన పాత్రల్లో వైవిధ్యం చూపించడానికి కృషి చేస్తున్నారు నటుడు ఆనంద చక్రపాణి. 'దాసి' చిత్రంతో తొలిసారిగా తెరపై కనిపించి లాంగ్ గ్యాప్ తర్వాత మళ్లీ 'మల్లేశం' సినిమాలో తండ్రి పాత్రతో ఎంట్రీ ఇచ్చారు. ఒకే ఒక్క చాన్స్ జీవితాన్ని మలుపు తిప్పుతుందని చాలా సందర్భాల్లో నిజమైన విషయం. అలాగే 'మల్లేశం' చిత్రం ఆనంద చక్రపాణి కెరీర్‌ని మలుపు తిప్పింది. ఇప్పటికి 45పైగా చిత్రాల్లో నటించేలా చేసింది.. అవన్నీ విభిన్న పాత్రలు కావడం తన అదృష్టం అంటూ ఆనంద చక్రపాణి చెప్పిన విశేషాలు ఇవి.

- చిన్నప్పటి నుంచి నాకు నటన అంటే ఇష్టం. మంచి నటుడుగా పేరు తెచ్చుకోవాలనే కోరిక ఉండేది. మంచి బ్రేక్ కోసం ఎదురు చూశాను. అది 'మల్లేశం' రూపంలో వచ్చింది. ఇప్పటివరకూ చాలా సినిమాలు చేశాను. ఒక పెద్ద హిట్ పడితే అందరి దృష్టిలో పడతాను. 'రాజు యాదవ్' చిత్రంలో నా పాత్రకు మంచి పేరు వచ్చింది. సినిమా తేడాగా ఉండడంతో ఆడలేదు. ఒక్కోసారి మనం ఎంత బాగా చేసినా సినిమా ఆడకపోతే ప్రయోజనం ఉండదు కదా 'మల్లేశం' స్థాయి పాత్ర నాకు మళ్లీ 'అనగనగా ఒక అతిథి' సిరీస్‌లో వచ్చింది. అందులో నాలుగే నాలుగు పాత్రలు. అందులో తండ్రి పాత్ర కూడా నాకు మంచి పేరు తెచ్చింది.
- ఇంతకుముందు అడ్వర్‌టైజ్‌మెంట్ రంగంలో ఉన్నాను. యాడ్ ఫిల్మ్స్ డైరెక్ట్ చేశాను. ఇప్పుడు మాత్రం నటన మీదే దృష్టి పెట్టాను. నాకు ఇచ్చిన పాత్రకు పూర్తి న్యాయం చేకూర్చడానికి చాలా హోమ్ వర్క్ చేస్తుంటాను. ఆ పాత్రలో ప్రవేశించడానికి మానసికంగా స్ట్రగుల్ అవుతాను. అందరూ అలాగే చేస్తుంటారు కానీ నాకు కూడా ఆ గుణం ఉంది. అందుకేనేమో ఎమోషనల్ ఫాదర్ వేషం అంటే నాకే పిలుపు వస్తుంది.
- పాత రోజుల్లో నేషనల్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నిర్మించిన చిత్రాలన్నీ వదిలిపెట్టకుండా చూసేవాణ్ణి. ఆర్ట్ ఫిల్మ్స్‌తోనే నా నడక మొదలైంది కనుక ఆ తరహా చిత్రాలంటే చాలా ఇష్టం. ఆ రోజుల్లో షబానా అజ్మీ, నజీరుద్దీన్ షా, ఓంపురి, స్మితాపాటిల్ నటించిన సినిమాలు ఎక్కువగా వచ్చేవి. ఆ చిత్రాల ప్రభావం నా మీద బాగా ఉండేది. ఈమధ్య కాలంలో నవాజుద్దీన్, ఇర్ఫాన్ ఖాన్ వంటి నాచురల్ ఆర్టిస్టులు ఎంతో అద్భుతంగా నటిస్తున్నారు. పాత్రలో రాణించడానికి చాలా హోమ్ వర్క్ చేస్తారు. అవన్నీ చూసి ప్రేరణ పొంది, నాచురల్‌గా నటించడానికి కృషి చేస్తున్నాను. మెలో డ్రామా నాకు నచ్చదు.
- ప్రస్తుతం నాలుగు చిత్రాలు షూటింగ్ దశలో, మరో రెండు విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. నిఖిల్ నటిస్తున్న 'స్వయంభూ'లో మంచి పాత్ర చేస్తున్నాను. అలాగే పర్యావరణం మీద చేస్తున్న 'గాంధీతాత జట్టు' కూడా నాకు మంచి పేరు తెస్తుందనే ఆశతో ఉన్నా.

ఇన్ ప్రోగ్రెస్

డబుల్ ఫన్..థ్రిల్



విజయం సాధించిన 'మత్తు వదలరా' చిత్రానికి సీక్వెల్‌గా 'మత్తు వదలరా 2' వస్తోంది. శ్రీసింహా కోడూరి లీడ్ రోల్‌లో, సత్య సైడ్ కిక్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి రితేశ్ రానా దర్శకుడు. మైత్రీ మూవీస్ సమర్పణలో చిరంజీవి (చెర్రీ), హేమలత పెదమల్లు నిర్మిస్తున్నారు. ఫరియా అబ్దుల్లా, సునీల్, అజయ్, రోహిణి ఇతర ముఖ్య పాత్రధారులు. శుక్రవారం ఈ సినిమా టీజర్‌ను విడుదల చేసిన అనంతరం హీరో శ్రీసింహా మాట్లాడుతూ 'డబుల్ ఫన్, థ్రిల్ ఉండేలా సెకండ్ పార్ట్ చేశాం. సెప్టెంబర్ 13న విడుదలవుతుంది' అని చెప్పారు. ఫస్ట్ పార్ట్‌లోనే ఒక ఐడియాను ప్లాంట్ చేసి దాని నుంచి డైరెక్ట్‌గా సీక్వెల్ చేశామని దర్శకుడు చెప్పారు.

కోర్టు రూమ్ డ్రామా



త్రిగుణ్ ప్రధాన పాత్ర పోషించిన 'ఉద్వేగం' చిత్రం టీజర్‌ను రామ్‌గోపాల్ వర్మ విడుదల చేశారు. మహిపాల్ రెడ్డి దర్శకత్వంలో లుకలపు మధు నిర్మించారు. 'కోర్టు రూమ్ డ్రామాతో తెలుగులో చాలా తక్కువ చిత్రాలు వచ్చాయి. ఈ సినిమా టీజర్ చూసిన తర్వాత సిన్సియర్ ఎఫర్ట్ అనీ, అందరూ సహజంగా నటించారనీ అర్థమవుతోంది' అన్నారు రామ్‌గోపాల్ వర్మ. నటుడు ఆదిత్యకు, త్రిగుణ్‌కు ఇది 25వ చిత్రమనీ, చట్టాన్ని బేస్ చేసుకుని రూపొందించిన ఈ సినిమా విడుదల తేదిని త్వరలో ప్రకటిస్తామని నిర్మాత చెప్పారు.

పెళ్లి విందులు.. చిందులు




పెళ్లిలో జరిగే విందులు, చిందుల్ని కన్నుల విందుగా చూపిస్తున్న చిత్రం 'లగ్గం'. సాయిరోనక్, ప్రగ్యా నగ్రా జంటగా నటించిన ఈ చిత్రాన్ని వేణుగోపాల్ రెడ్డి నిర్మించారు. రమేశ్ చెప్పాల దర్శకుడు. ఈ సినిమా టీజర్‌ను విడుదల చేసిన హీరో ఆది సాయికుమార్ యూనిట్‌కు అభినందనలు తెలిపారు. 'కథ, కథనం ఈ సినిమాకు బలం. ఫ్యామిలీ మెంబర్స్ అంతా కలసి చూసేలా సినిమా ఉంటుంది' అని దర్శకుడు చెప్పారు. కథ నచ్చి ఈ సినిమా నిర్మించినట్లు నిర్మాత తెలిపారు. 'లగ్గం' సినిమా చేయడం తన అదృష్టం అని సాయిరోనక్ చెప్పారు.

డిసెంబర్‌లో విడుదల



వెట్రిమారన్ దర్శకత్వంలో విజయ్ సేతుపతి, సూరి ప్రధాన పాత్రలు పోషించిన 'విడుదల 2' చిత్రం రిలీజ్ డేట్ ఖరారైంది. డిసెంబర్ 20న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు యూనిట్ ప్రకటించింది. గతంలో వచ్చిన 'విడుదల' చిత్రానికి ఇది కొనసాగింపు. గౌతమ్ వాసుదేవ్ మీనన్, అనురాగ్ కశ్యప్, మంజు వారియర్ కీలకపాత్రలు పోషించారు. ఎల్రెడ్ కుమార్ నిర్మాత. సంగీతం: ఇళయరాజా, సినిమాటోగ్రఫీ: ఆర్ వేల్రాజ్.

బూసాన్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు 'హీరామండి'



ప్రతిష్ఠాత్మక బూసాన్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు 'హీరామండి' వెబ్‌సిరీస్ నామినేట్ అయింది. ఉత్తమ ఓటీటీ ఒరిజినల్, ఉత్తమ ఒరిజినల్ సాంగ్ విభాగాల్లో ఇది నామినేట్ అయింది. బూసాన్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు తన సిరీస్ నామినేట్ అవ్వడం పట్ల దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ ఆనందం వ్యక్తం చేశారు. 'ఈ చిత్రోత్సవాలకు రెండు విభాగాల్లో నామినేట్ అవ్వడం మా టీమ్‌కు గర్వకారణం' అని ఆయన సోషల్ మీడియాలో తెలిపారు. ఈ సారి ఇండియా నుంచి బూసాన్ చలన చిత్రోత్సవాలకు ఎంపికైన ఏకైక ప్రాజెక్ట్ గా 'హీరామండి' నిలిచింది. మనీషా కొయిరాలా, అదితీరావ్ హైదరీ, సోనాక్షి సిన్హా తదితరులు ప్రధాన పాత్రలు పోషించిన ఈ వెబ్‌సిరీస్ నెట్‌ఫ్లిక్స్‌లో విడుదలై ప్రేక్షకాదరణ పొందింది.

చంద్రబాబు.. పవన్ పర్యటన రద్దు



జేఎన్‌టీయూ కళాశాలలో ఏర్పాటు చేసిన సభా ప్రాంగణంలో నిలిచిన వర్షపు నీరు

నరసరావుపేట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): వాతావరణం అనుకూలించకపోవడంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవణ్ కళ్యాణ్ నరసరావుపేటలో శుక్రవారం పర్యటన రద్దు అయింది. తెల్లవారుజాము నుంచి వర్షం కురవడంతో కాకాని వద్ద ఉన్న జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో వనమహోత్సవం నిర్వహణకు ఆటంకం ఏర్పడింది. దీంతో వారి పర్యటన రద్దయింది. సభా ప్రాంగణంలో నీరు నిలిచిపోయింది. ఆ ప్రాంతమంతా బురదమయంగా మారింది.

అప్పు డబ్బు కోసం మౌన పోరాటం

చిలకలూరిపేట, ఆగస్టు 30: కష్టపడి సంపాదించుకున్న డబ్బు చిలకలూరిపేటలోని ఓ సెంటర్ భాగస్తులకు అప్పుగా ఇచ్చాం, ఆ అప్పును తిరిగి తీర్చమంటే వారు తమపైనే ఎదురుదాడి చేస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుల తరపున పెద్దమనిషిగా వ్యవహరించిన పట్టణ ప్రముఖులు తేలప్రోలు వీరయ్య శుక్రవారం మీడియాతో మాట్లాడారు. ఈ సెంటర్ ప్రధాన భాగస్తుడు అమెరికాలో స్థిరపడి తమను వేధిస్తున్నారని, సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తూ ఇబ్బంది పెడుతున్నారని వాపోయారు. మొత్తం 15 మంది అప్పు ఇచ్చామని, అది ఇప్పుడు రూ. 8.5 కోట్లకు చేరుకున్నదని వివరించారు. ఇచ్చిన డబ్బు తిరిగి ఇవ్వమంటే ఎస్‌ఆర్‌ఐలను వేధిస్తున్నారంటూ ఎదురు దాడి చేస్తున్నారని వాపోయారు. వారి ఆస్తులు కబ్జా చేస్తున్నామని సోషల్ మీడియాలో విస్తృతంగా దుష్ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తామంతా తెలుగుదేశం పార్టీకి చెందిన వారిమి కావడంతో ఈ విషయాన్ని పార్టీ దృష్టి కూడా తీసుకెళ్లామని చెప్పారు. వాస్తవాలు ప్రజలకు తెలియజేసేందుకు సెంటర్ వెలుపల తాము మౌన పోరాటం చేస్తున్నామని చెప్పారు. టీడీపీకి చెందిన వారికి అన్యాయం జరుగుతున్నందున ప్రజాప్రతినిధులు న్యాయం చేయాలని విన్నవించారు.

విద్యుదుత్పత్తి నిలిపివేత..

రెంటచింతల, ఆగస్టు 30: నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టుకు చెందిన 14 గేట్లను 4 మీటర్ల మేర ఎత్తి పులిచింతలకు 2,85,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఎస్‌ఈ కె.వెంకటరమణ చెప్పారు. ఎగువన ఉన్న సాగర్ నుంచి 2,93,000 క్యూసెక్కుల నీరొస్తుందన్నారు. విద్యుదుత్పత్తిని పూర్తిగా నిలిపివేసినట్లు తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 74.19 మీటర్ల మేర నీరుండగా ఈ నీరు 6.2020 టీఎంసీలకు సమానమన్నారు.

రైల్ ఓవర్ రైల్‌కు గ్రీన్ సిగ్నల్

- బొమ్మైపల్లి - బీబీనగర్ స్టేషన్లను కలుపుతూ 8.54 కి.మీ నిర్మాణం
- రూ.281 కోట్ల నిధులు అవసరమౌతాయని అంచనా
- బడ్జెట్‌లో రూ.20 కోట్ల కేటాయింపు



రైల్ వోవర్ రైలు నమూనా

గుంటూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో ఒక రైల్ ఓవర్ రైల్(ఆర్‌వోఆర్) రానున్నది. నడికుడి మార్గంలో సికింద్రాబాద్‌కు వెళ్లే రైళ్లు, అటు నుంచి ఇటుగా వచ్చే రైళ్లకు పగిడిపల్లిలో సిగ్నల్ క్లియరెన్స్ సమస్యలు తలెత్తుతోన్నాయి. ఇక్కడే రైళ్ల హ్యాండింగ్ వోవర్ జరుగుతుంది. మెయిన్ లైన్‌లో ఏదైనా రైలు వస్తుందంటే దానికి ప్రిసిడెన్స్ ఇచ్చి ఈ మార్గంలో రైలుని నిలిపేస్తున్నారు. దీని వలన కొంత సమయపాలన దెబ్బతింటుంది. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా రైల్వే శాఖ ఆర్‌వోఆర్‌ని మంజూరు చేసింది. కేంద్ర బడ్జెట్‌లో నిధులు కూడా కేటాయించిన దరిమిలా ఈ ఆర్థిక సంవత్సరంలోనే టెండర్ల ప్రక్రియ పూర్తియి పనులు ప్రారంభమౌతాయని రైల్వేవర్గాలు తెలిపాయి.

రైళ్లను నిలుపుదల చేయాల్సిన అవసరం ఉండదు

బీబీనగర్ - గుంటూరు రైల్వే డబ్లింగ్ ప్రాజెక్టు పనులు కూడా త్వరలో ప్రారంభం కాబోతోన్నాయి. ఈ నేపథ్యంలో కీలకమైన బీబీనగర్ - బొమ్మైపల్లి రైల్ ఓవర్ రైల్(ఆర్‌వోఆర్)ని త్వరితగతిన పూర్తి చేయాలని రైల్వే శాఖ బావిస్తుంది. మొత్తం 8.54 కిలోమీటర్ల పొడవునా ఈ ఆర్‌వోఆర్‌ని నిర్మించాల్సి ఉంటుంది. ఇందుకోసం రూ.281 కోట్ల నిధులు ఖర్చు అవుతాయని ప్రాథమికంగా అంచనా వేశారు. ఈ బడ్జెట్‌లోనే రూ.20 కోట్లను కేంద్ర రైల్వే శాఖ కేటాయించింది. ఈ ఆర్‌వోఆర్ నిర్మాణం జరిగితే పగిడిపల్లి వద్ద క్లియరెన్స్ కోసం రైళ్లను నిలుపుదల చేయాల్సిన అవసరం ఉండదు. నేరుగా కాజీపేట - సికింద్రాబాద్ మార్గంలోకి ప్రవేశించి అక్కడి నుంచి సికింద్రాబాద్‌కు వెళ్లిపోవచ్చు. ప్రస్తుతం పగిడిపల్లి వద్ద కొన్ని సందర్భాల్లో 10 నిమిషాల నుంచి అరగంట పాటు కూడా నడికుడి నుంచి వెళ్లిన రైళ్లు నిలిచిపోతున్నాయి. దీంతో నిర్ణీత సమయానికి రైళ్లు సికింద్రాబాద్ చేరుకోలేకపోతున్నాయి.

సమయం ఆదా..

గుంటూరు - బీబీనగర్ డబ్లింగ్ పూర్తి చేసినా ఈ ఆర్‌వోఆర్ నిర్మించకపోతే పెద్దగా ఉపయోగం ఉండదు. దీనిని పరిగణనలోకి తీసుకొనే రైల్వే శాఖ ఆర్‌వోఆర్‌ని రైల్వే బోర్డుకు ప్రతిపాదించి మంజూరు చేయించింది. ఆర్‌వోఆర్ వలన కింద ఒక రైలు మార్గం, పైన ఒక రైలు మార్గం ఉంటుంది. దాంతో ఎలాంటి అడ్డంకులు లేకుండా పగిడిపల్లి జంక్షన్‌లో అటు కాజీపేట నుంచి వచ్చే రైళ్లు, ఇటు నడికుడి మార్గం నుంచి వచ్చే రైళ్లు ప్రయాణించగలవు. తద్వారా సమయం ఆదా అవుతుంది.

అనంత భావజాలికుడు చంద్రబాబు

- విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కె.లక్ష్మీనారాయణ
- ఘనంగా చంద్రబాబు ఎక్స్‌వో పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణలో డాక్టర్ కె.లక్ష్మీనారాయణ, డాక్టర్ కేవీ సత్యనారాయణ

గుంటూరు(తూర్పు), ఆగస్టు 30: పారిశ్రామిక, క్షీర, హరిత విప్లవం అంటూ నిత్యం ఆలోచించి వాటిని ఆచరణలో పెట్టిన అనంత భావజాలికుడు చంద్రబాబు అని విశ్రాంత ఐఏ ఎస్ అధికారి డాక్టర్ కె.లక్ష్మీనారాయణ అన్నారు. 'చంద్రబాబు ఎక్స్‌వో ది ఫౌంటైన్ ఆఫ్ క్రియేటివిటీ" ఆంగ్ల పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని గుంటూరు కుందులరోడ్డులోని కమ్మ బాలికల వసతి గృహంలో శుక్రవారం నిర్వహించారు. సభకు కమ్మ జన సేవా సమితి అధ్యక్షుడు సామినేని కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ చంద్రబాబు స్ఫూర్తితో యువత ముందుకు సాగాలన్నారు. ప్రతి వ్యక్తి కుటుంబానికి సమయం ఇవ్వాలనే చంద్రబాబు ఆలోచనను ప్రతి ఒక్కరూ ఆచరించాలన్నారు. విద్యార్థులు పత్రిక, పుస్తక పఠనం అలవర్చుకోవాలని సూచించారు. మరో విశిష్ట అతిథి, పుస్తక ఆంగ్ల అనువాద రచయిత డాక్టర్ కేవీ సత్యనారాయణ మాట్లాడుతూ ఉద్యోగాల కోసం వెంపర్లాడే స్థితి నుంచి ఉద్యోగాలు కల్పించే స్థాయికి తెలుగుజాతి ఎదగడం చంద్రబాబు దార్శనికత ఫలితమేనని తెలిపారు. 30 నుంచి 300 వరకు ఇంజినీరింగ్ కళాశాలను పెంచిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. రెరా మాజీ చైర్మన్ డాక్టర్ వెలమాటి రామనాధ్ మాట్లాడుతూ విజన్- 47 ప్రణాళికలు ఇప్పటికే సిద్ధం చేసిన నిత్య కృషీ వలుడు చంద్రబాబు అని కొనియాడారు. ఈ పుస్తకాన్ని రాజకీయ కోణంలో కాకుండా ఒక గొప్ప భవిష్యత్తు దార్శనికుని జీవనయానంలోని ప్రస్తుత సమాజానికి, మానవాళికి ఉపయుక్తమైన సంఘటనల సమాహారంగా పరిగణించాలని కోరారు. వీవీఐటీ చైర్మన్ విద్యాసాగర్ మాట్లాడుతూ ప్రస్తుత తరంలో ఆలోచించే రాజకీయ నాయకుడు చంద్రబాబు ఒక్కరేనని కొనియాడారు. సభలో పుస్తక రచయిత శాఖమూరు శ్రీనివాస ప్రసాదు, కేజేఎస్ ఎస్ కార్యదర్శి చుక్కపల్లి రమేష్ ప్రసంగించారు. కార్యక్రమంలో కేజేఎస్‌ఎస్ పాలక వర్గ సభ్యులు, టీడీపీ నాయకులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

ప్రకాశం బ్యారేజీకి భారీగా వరద నీరు



విద్యుత్ వెలుగుల్లో ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి

గుంటూరు, తాడేపల్లి టౌన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): కృష్ణానది ఎగువ భాగంలో కురుస్తున్న భారీ వర్షాలకు ప్రకాశం బ్యారేజీకి భారీగా వరదనీరు వచ్చి చేరుతున్నది. శుక్రవారం రాత్రికి ఏ క్షణంలో నైనా 3,35,000 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేసే అవకాశం ఉందని కృష్ణానది సంరక్షక విభాగం నుంచి జిల్లా యంత్రాంగానికి సమాచారం అందింది. దీని దృష్ట్యా బ్యారేజి ఎగువ, దిగువన నదీపరివాహక ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో వరద ప్రవాహం వద్దకు వెళ్ల రాదని విజ్ఞప్తి చేశారు. పశువులను కూడా నది వద్దకు తీసుకెళ్లొదన్నారు. ఎలాంటి సమస్య తలెత్తినా కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూం నంబరు. 08632234014ని సంప్రదించాలని సూచించారు. తుళ్లూరు, తాడేపల్లి, మంగళగిరి, దుగ్గిరాల, కొల్లిపర మండలాల అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తుండాలన్నారు. నదిలో వరదనీరు ఉధృతి కారణంగా లోలెవల్ చప్టాల వద్ద ప్రమాదకరంగా నీరు ప్రవహించే అవకాశం ఉన్నందున వాటి వద్ద పెట్రోలింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

డెల్టా కాలువలకు 13,563 క్యూసెక్కులు నీరు

పులిచింతల ప్రాజెక్టు నుంచి 3,36,169 క్యూసెక్కుల వరద నీరు శుక్రవారం (రాత్రి వరకు) ప్రకాశం బ్యారేజి వద్దకు చేరుతున్నట్టు నీటిపారుదల శాఖ జేఈ అజముద్దీన్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా 67 గేట్లను 8 అడుగులు, 3 గేట్లను పూర్తిగా ఎత్తి దిగువకు 3,22,606 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. అలాగే తూర్పు, పశ్చిమ డెల్టా కాలువలకు 13,563 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు జేఈ తెలిపారు. కాగా శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత క్రమేపీ వరద ఉధృతి పెరిగే అవకాశం ఉందని జేఈ తెలిపారు.

రైతుల ఆదాయ వనరులు పెంచండి

- నకిలీ విత్తనాల చలామణిని అరికట్టండి
- వ్యవసాయ శాఖ సమీక్షలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని



వ్యవసాయశాఖ అధికారులతో సమీక్షిస్తున్న కేంద్ర మంత్రి పెమ్మసాని

గుంటూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): 'రైతులకు ఆదాయ వనరులు పెంచే విధంగా వారిని చైతన్యవంతం చేయండి. వాణిజ్య పంటలపై అవగాహన పెంచి రైతులను ప్రోత్సహించండి.' అని గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. గుంటూరులోని ఎంపీ కార్యాలయంలో శనివారం వ్యవసాయ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలన్నారు. రైతులకు ప్రభుత్వపరంగా అందే సేవల్లో ఎలాంటి లోపం ఉండకూడదని స్పష్టం చేశారు. నకిలీ విత్తనాలు అరికట్టేందుకు ఇప్పటి వరకు తీసుకున్న చర్యలపై సంబంధిత అధికారులను ప్రశ్నించారు. రైతులకు పంట మార్పిడి వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ, వారి ఆదాయం పెంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందే పంటలను ప్రోత్సహించాలని తెలిపారు. వ్యవసాయ అధికారులు రైతులకు అందుబాటులో ఉండాలన్నారు. పంటలకు సాగునీటి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, చీడపీడలపై రైతులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని ఆదేశించారు. ఎరువుల కొరత సమస్యను అధికారులు పెమ్మసాని దృష్టికి తీసుకురాగా వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

విజయకీలాద్రిపై వైభవంగా శ్రావణ శుక్రవారం



పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న వెంకటాచార్యులు దంపతులు

తాడేపల్లి టౌన్, ఆగస్టు 30: వేద విశ్వవిద్యాలయం వ్యవస్థాపకులు శ్రీత్రిదండి చినజీయర్ స్వామి మంగళశాసనములతో సీతానగరంలోని విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై 4వ శ్రావణ శుక్రవారం పూజలు ఘనంగా జరిగాయి. తొలుత చిన్నజీయర్ ఆశ్రమ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు దంపతులు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం అష్టలక్ష్మి అమ్మవారికి తిరువంజనసేవ, అలంకరణ, అష్టోత్తర శతనామార్చన, శ్రీసూక్త హవనం కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం సహస్ర బిల్వార్చన, కదంబ పుష్పాలంకరణ, నివేదన నక్షత్ర హారతి సేవ, మంగళశాసనములతో చివరి శ్రావణ శుక్రవారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు శ్రీనివాసాచార్యులు అనంత స్వామి, వేద విద్యార్థులు, భక్తులు పాల్గొన్నారు.

26 క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల

మాచర్ల రూరల్, ఆగస్టు 30: నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ 26 క్రస్ట్ గేట్ల ద్వారా శుక్రవారం అధికారులు నీటిని విడుదల చేశారు. 8 గేట్లను 10 అడుగులు, 18 గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 2,62,430 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. కాగా నాగార్జున సాగర్ జలాశయం నీటి మట్టం 589.00 అడుగులు ఉంది. ఇది 309.05 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9,633 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8,280 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,354 క్యూసెక్కులు, 26 క్రస్ట్ గేట్ల ద్వారా 2,61,430, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,800, ఎల్ఎల్‌సీ ద్వారా 600 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 3,12,097 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 3,12,097 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

కారు, స్కూటర్ ఢీ : ఉపాధ్యాయిని మృతి



డీవీ రత్నకుమారి

ఫిరంగిపురం, ఆగస్టు 30: కారు, స్కూటర్‌ను ఢీకొనగా ఉపాధ్యాయిని మృతి చెందిన సంఘటన శుక్రవారం సాయంత్రం మండలంలోని గుంటూరు - నరసరావుపేట రహదారి పై నుదురుపాడు వద్ద జరిగింది. పోలీసుల కథనం ప్రకారం నాదెండ్ల మండలం తూబాడు హైస్కూల్‌లో ఇంగ్లిషు ఉపాధ్యాయినిగా పని చేస్తున్న దంటు వెంకట రత్న కుమారి(45) సాయంత్రం 5 గంటలకు స్కూటీపై ఫిరంగిపురం వస్తుండగా నరసరావుపేట వైపు నుంచి గుంటూరు వెళ్తున్న కారు అతి వేగంగా నడపటం వలన ఉపాధ్యాయిని వెళ్తున్న స్కూటీని వెనుక నుంచి ఢీకొంది. ఉపాధ్యాయిని రత్నకుమారి కింద పడి అక్కడికక్కడే మృతి చెందారు. మృతురాలు ఫిరంగిపురంలో నివాసం ఉంటున్నారు. మృతురాలి భర్త అంకిరెడ్డి నరసరావుపేటలో ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో అధ్యాపకులుగా పని చేస్తున్నారు. వీరికి ఒక కుమార్తె. సంఘటనా స్థలాన్ని సీఐ డి.రవీంద్రబాబు, ఎస్‌ఐ సదాశివరావు పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు.

నకిలీ కరెన్సీ కేసులో జైలు శిక్ష

ఈపూరు, ఆగస్టు 30: నకిలీ కరెన్సీ నోట్లు కేసులో ముద్దాయికి 3 ఏళ్ల 6 నెలల కఠిన కారాగార శిక్ష, రూ.2500 జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు చెప్పినట్లు ఈపూరు ఎస్‌ఐ ఎం.ఉమామహేశ్వరరావు శుక్రవారం తెలిపారు. 2019 ఆగస్టు 24న ఈపూరు మండలం వనికుంట గ్రామంలో కూల్‌డ్రింక్ షాపులో ముగ్గురు యువకులు కూల్‌డ్రింక్ తీసుకొని రూ.500 నోటు ఇచ్చారు. షాపు యజమాని కాశీమల్ల నాగ రాజు ఆనోటును పరిశీలించి నకిలీదిగా గుర్తించి ఆ యువకులను ప్రశ్నించాడు. దీంతో వారు ఏమి మాట్లాడకుండా అక్కడ నుంచి పారిపోయారు. వెంటనే సదరు షాపు యజమాని నాగరాజు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్‌ఐ జి.గిరిబాబు కేసు నమోదు చేశారు. అప్పటి వినుకొండ సీఐ ఎంవీ సుబ్బారావు కేసును దర్యాప్తు చేసి రొంపిచర్ల మండలం సంతగుడిపాడుకు చెందిన వర్ల చిరంజీవిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చారు. కోర్టులో నేరం రుజువు కావడంతో నర్స రావుపేట ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్ కోర్టు న్యాయమూర్తి ఎ.పూర్ణిమ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరుపున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ స్వర్ణలత భాను వాదనలు వినిపించారు.

పులిచింతల ప్రాజెక్టులో 42.16 టీఎంసీల నీరు

అచ్చంపేట, ఆగస్టు 30: పులిచింతల ప్రాజెక్టులో శుక్రవారం 42.16 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 2,71,624 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుందన్నారు. ప్రాజెక్టు వద్ద 13 గేట్ల ద్వారా 3,11,345 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల అవుతుందన్నారు. ప్రాజెక్టు వద్ద 16 వేల క్యూసెక్కుల నీరు పవర్ జనరేషన్ ద్వారా దిగువకు విడుదల అవుతుంన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.25 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	103, 111,122
చికెన్ విత్ స్కిన్	196.00
చికెన్ స్కిన్ లెస్	206.00

51,315 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 44,587 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 51,315 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 15,619 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	7500	17500	334	8500	14500
నెంబరు. 5	9000	12500	నెంబరు. 5	12000	12000
273	10500	14500	273	10500	13500
341	9000	16500	341	8000	15000
4884	11400	11400	4884	10000	13500
సూపర్ 10	8500	9000	సూపర్ 10	–	–
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7500	18500	తేజ	8000	18700
బ్యాడిగి	8000	15000	బ్యాడిగి	9000	14000
దేవనూరు డీలక్స్	8500	13000	దేవనూరు డీలక్స్	9500	14000
తెల్లకాయలు	4500	12000	తెల్లకాయలు	5000	10500

పల్నాడు వార్తలు

గలగల.. జలకళ



మండలంలోని ఎత్తిపోతల జలపాతం శుక్రవారం జలకళను సంతరించుకుంది. గురువారం సాయంత్రం నుంచి కురుస్తున్న వర్షంతో ఎగువ ప్రాంతాల నుంచి ఎత్తిపోతలకు భారీగా వర్షపు నీరు చేరింది. 70 అడుగుల ఎత్తు నుంచి నీరు గలగల జాలువారుతూ ఎత్తిపోతల జలపాతం వద్ద కొత్త అందాలు కనువిందు చేస్తున్నాయి. - మాచర్లటౌన్

పచ్చిరొట్ట ఎరువులు వాడండి

దాచేపల్లి, ఆగస్టు 30: వాతావరణంలో మార్పులకు అనుగుణంగా రైతులు రసాయనిక ఎరువులను తగ్గించి జీవన ఎరువులు, పచ్చిరొట్ట ఎరువులను ఉపయోగించాలని ఆత్మ ఏవో డీఆర్‌సీ ప్రవీణ్ తెలిపారు. శుక్రవారం దాచేపల్లి మండలం కేశానుపల్లి గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో రైతులకు ఎరువుల వాడకంపై అవగాహన, శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. పరిశ్రమలు, వాహనాలు నుంచి వెలువడుతున్న హరిత వాయువుల కారణంగా కాలుష్యంతో పాటు భూతాపం పెరిగిపోతోందన్నారు. వాతావరణంలో వుండాల్సిన బొగ్గుపులుసు వాయువు 330 పీపీఎం నుంచి 420 పీపీఎంకు చేరడం వలన వాతావరణంలో విపరీతమైన మార్పులు సంభవిస్తున్నాయన్నారు. నేలలో కార్బన్‌శాతం బాగా తగ్గిపోయిందని, భూమిలో కర్బన్‌శాతం పెరిగేలా రైతులు వ్యవసాయం చేయాలని కోరారు. పచ్చిరొట్ట ఎరువులైన జనుము, జీలుగ, పిల్లిపెసర వాడకంతో భూసారాన్ని పెంచవచ్చన్నారు. కార్యక్రమంలో దాచేపల్లి ఏవో పాపకుమారి, తదితరులు పాల్గొన్నారు.



రామాపురం వద్ద కృష్ణానది ప్రవాహాన్ని పరిశీలిస్తున్న తహసీల్దారు కుటుంబరావు

మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దు

● గ్రామస్థులంతా అప్రమత్తంగా ఉండాలి ● తహసీల్దారు కుటుంబరావు

దాచేపల్లి, ఆగస్టు 30: కృష్ణానదిలో వరద నీటి ప్రవాహం ప్రమాదకరంగా ఉందని, మత్స్యకారులు చేపలు పట్టేందుకు నదిలోకి వెళ్లొద్దని దాచేపల్లి తహసీల్దారు కుటుంబారావు హెచ్చరించారు. శుక్రవారంమండలంలోని రామాపురంగ్రామంలో కృష్ణానది ఒడ్డున నివాసముంటున్న పల్లెకారుల కుటుంబాలను ఆయన కలిశారు. వారితో మాట్లాడుతూ.. నదీ ప్రవాహం ఉధృతంగా ఉందని, అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాత్రివేళ వృద్ధులు, చిన్నారులు, మహిళలు గ్రామంలోని పాఠశాలకు తరలివెళ్లాలని కోరారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, ఇతరశాఖల సిబ్బంది అందుబాటులో ఉంటారని వారితో అన్నారు. ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని, నీటి ప్రవాహాన్ని, ఉధృతిని గమనించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఆర్‌ఐలు, వీఆర్‌వోలు ఉన్నారు.



మందులను అందజేస్తున్న వైద్య సిబ్బంది

దోమ కాటుకు గురికావొద్దు

● వైద్యశిబిరంలో పీహెచ్‌సీ వైద్యాధికారి నాగరాజు

దుర్గి, ఆగస్టు 30: దోమకాటుకు గురి కాకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారి నాగరాజు అన్నారు. శుక్రవారం మండలంలోని ముటుకూరు ఎస్సీ కాలనీలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ముటుకూరు పీహెచ్‌సీ ఆధ్వర్యాన వైద్యశిబిరం నిర్వహించారు. స్థానికులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో దళిత బహుజన సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుక్కమూడి ప్రసాద్, మరియ దాసు, మాచర్ల రవీంద్రబాబు, పీహెచ్‌సీ సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు, సామ్రాజ్యం, ఏఎన్ఎం అన్నమ్మ, పద్మ, ఆశావర్కర్లు బంకా నాగమణి, మాచర్ల మరియమ్మ, వెంకమ్మ, సైదమ్మ, లక్ష్మి, హెచ్ఎం రమాదేవి, శేఖర్, వైద్య ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై సెమినార్

సత్తెనపల్లి రూరల్, ఆగస్టు 30 : మండలంలోని కంటెపూడి వద్ద గల డాక్టర్ ఆరిమండ వర ప్రసాదరెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో 'టెక్ ఆఫ్ ది ఎరా - ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్' అనే అంశంపై శుక్రవారం సెమినార్ నిర్వహించారు. ఎస్ఆర్ఎం యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్లు డాక్టర్ కే హేమంత్ కుమార్, డాక్టర్ దుర్గా ప్రసాదులు రాబోయే రోజుల్లో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ఎలాంటి విప్లవాత్మకమైన మార్పులు తీసుకొస్తుంది, ఎలాంటి వాటిపై ప్రభావం చూపుతుందో విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాస కుమార్, సీఎస్ఈ హెచ్‌వోడి పాల్సన్, బీటెక్ మూడవ, నాల్గవ సంవత్సర విద్యార్థులు పాల్గొన్నారు.

ఆపద్బాంధవుడు నందమూరి బాలకృష్ణ

● 50 ఏళ్ల సినీ ప్రస్థానం కార్యక్రమాల్లో టీడీపీ నేతలు

మాచర్ల రూరల్, ఆగస్టు 30: లక్షలాది మంది క్యాన్సర్ రోగులకు వైద్యాన్ని ఉచితంగా అందిస్తున్న సినీ హీరో నందమూరి బాలకృష్ణ ఆపద్బాంధవుడని టీడీపీ సీనియర్ నేత, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు అన్నారు. సినీ హీరో బాలకృష్ణ నటనకు 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొమెర దుర్గారావు ఆధ్వర్యాన పట్టణంలో వేడుకలు నిర్వహించారు. ముందుగా సెంటరులోని నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో షేక్ అన్వర్, కంభంపాటి అనిల్‌కుమార్, బొట్టు కోటేశ్వరరావు, దుర్గాకుల ప్రసాద్, శివ, వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కారంపూడి: సినీహీరో నందమూరి బాలకృష్ణ సినీ రంగ ప్రవేశం చేసి 50 యేళ్లు పూర్తయిన సందర్భంగా శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో వద్ద టీడీపీ నేతలు కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఆటో బోల్తా.. ఇద్దరికి గాయాలు

వెల్దుర్తి, ఆగస్టు 30: ఆటో బోల్తా పడి ఇద్దరికి గాయాలైన సంఘటన మండలంలోని మండాది వద్ద శుక్రవారం రాత్రి జరిగింది. మాచర్ల నుంచి తేరాలకు ఏడుగురు ప్రయాణికులతో వెళ్తున్న ఆటో మార్గమధ్యం మండాది గ్రామంలోని బ్రహ్మంగారి గుడి వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో గంగుల ఉమాదేవి, నాలుగేళ్ల లిఖిత గాయాలపాలయ్యారు. మిగతా వారికి స్వల్ప గాయాలపాలయ్యారు. ఉమాదేవి, లిఖితలను మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. డ్రైవర్ మద్యం మత్తులో ఆటో నడపడం వలనే ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. అయితే డ్రైవర్ ఆటో బోల్తా పడగానే గాయపడిన ప్రయాణికులను పట్టించుకోకుండా ఆటోను యథాస్థితికి తెచ్చి అక్కడి నుంచి పరారయ్యాడు.

భావితరాల కోసం మొక్కలు నాటుదాం

● వన మహోత్సవం కార్యక్రమంలో వక్తలు
● జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఘనంగా నిర్వహణ
● పాల్గొన్న అధికారులు, విద్యార్థులు, సంస్థల నేతలు



రామకృష్ణాపురం గురుకుల పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న సర్పంచ్ రమాదేవి, కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

రాజుపాలెం, ఆగస్టు 30 : భావితరాల ఆరోగ్యకరమైన జీవితాల కోసం మనమంతా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఎంఈవో మల్లికార్జునశర్మ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ పిలుపులో భాగంగా శుక్రవారం జిల్లావ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో వన మహోత్సవ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు, విద్యా సంస్థలలో విద్యార్థులు, నిర్వాహకులు, వివిధ సంస్థల నేతలు ఆయా కార్యక్రమాలలో పాల్గొని మొక్కలు నాటారు.

మండలంలోని కోటనెమలిపురి శివారు వీరమ్మ కాలనీ, ఎంపీపీఎస్ పాఠశాల ఆవరణంలో దీనమ్మ అండ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మల్లికార్జునశర్మ మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకునేందుకు మన జీవన విధానంలో మార్పులు చేసుకోవాల్సిన రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని కాపాడాలని కోరారు. కార్యక్రమంలో సొసైటి చైర్మన్ జీ.శంకరరావు, ఉపాధ్యాయులు బాల నాగేంద్రబాబు, వీరాంజనేయులు, విద్యాకమిటి చైర్మన్ దూదేకుల శ్రీను బాషా, వైస్ చైర్మన్ రేఖ నారి లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

సత్తెనపల్లి రూరల్: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, దీనిలో భాగంగా ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని నందిగామ సర్పంచ్ బలిజేపల్లి రమాదేవి అన్నారు. మండలంలోని రామకృష్ణాపురం వద్దగల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాల ఆవరణలో వన మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో బాలికల, బాలుర గురుకుల పాఠశాలల ప్రిన్సిపల్స్ శైలజ, జాన్సన్, పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ ప్రెసిడెంట్ రత్నబాబు, బలిజేపల్లి విజయ కుమార్, మరియదాసు, ఎం వెంకట్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సత్తెనపల్లి: సీఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు శుక్రవారం పట్టణంలోని 27వ వార్డు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యా కమిటీ చైర్మన్ మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం వెంకటేశ్వరరావు, షేక్ ఖాశిం, సయ్యద్ పెద కరిముల్లా, మీరా హుస్సేన్, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



రాజుపాలెం మండలంలోని వీరమ్మ కాలనీలో మొక్కలు నాటుతున్న మండల విద్యాశాఖ అధికారి మల్లికార్జున శర్మ



డిప్యూటీ తహసీల్దారుకి వినతిపత్రం అందిస్తున్న యూటీఎఫ్ నేతలు

పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలి

మాచర్లటౌన్, ఆగస్టు 30: ఏకీకృత పెన్షన్ స్కీంను రద్దు చేసి పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని యూటీఎఫ్ నేతలు కోరారు. శుక్రవారం మండల రెవెన్యూ కార్యాలయం వద్ద వారు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పోరాటాల సాధించుకున్న పాత పెన్షన్ స్కీం ఉద్యోగుల హక్కు అని, ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఎటువంటి ప్రయోజనం లేని యూపీఎస్‌ని రద్దు చేయాలని కోరారు. అనంతరం డిప్యూటి తహసీల్దార్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సంఘ నేతలు కే.శ్రీనివాసరావు, కేశవ రెడ్డి, నారాయణ, బాలునాయక్, సుమతి, ఖాదర్‌వలి, నాసర్‌రెడ్డి, నజీర్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

పట్టణ సమస్యలను పరిష్కరించండి

పిడుగురాళ్ల, ఆగస్టు 30: పిడుగురాళ్ల మున్సిపల్ కమిషనర్ పి శ్రీధర్‌ను శుక్రవారం పలువురు టీడీపీ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. కమిషనర్‌గా నియమితులైన శ్రీధర్ పట్టణంలో పరిశుభ్రత, తాగునీటి సరఫరా, వివిధ సమస్యలపై సత్వరమే స్పందించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని పట్టణ పార్టీ అధ్యక్షుడు పాండురంగ శ్రీను కమిషనర్‌ను కోరారు. కార్యక్రమంలో పణితి రవి, వల్లెపు రామకృష్ణ, షేక్ సైదా, సుతారు మల్లేశ్వరరావు, రామకృష్ణ, పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పిడుగురాళ్ల, ఆగస్టు 30: విద్యుత్ సబ్‌స్టేషన్ అత్యవసర మరమ్మతుల కారణంగా జూలకల్లు, జానపాడు, పిడుగురాళ్ల, అను పాలెం సబ్‌స్టేషన్‌ల పరిధిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ శివనాగిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయా గ్రామాల ప్రజలు గమనించి విద్యుత్ అధికారులకు సహకరించాలని కోరారు.

ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి కౌన్సెలింగ్

రెంటచింతల,ఆగస్టు 30 : పని సర్దుబాటులో భాగంగా సత్తెనపల్లి, గురజాల డివిజన్లలోని 19 మండలాల్లో 31 ఉపాధ్యాయ పోస్టులకు శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించి భర్తీ చేసినట్లు సత్తెనపల్లి డీవైఈవో ఏసుబాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సత్తెనపల్లి డివిజన్‌లో ఇంగ్లీషు2, తెలుగు 3, గురజాల డివిజన్‌లో ఇంగ్లీషు 2, లెక్కలు 2, నేచరల్ సైన్స్ 5, ఫిజికల్ సైన్స్ 11, సోషల్ 6 పోస్టులను భర్తీ చేశామన్నారు. హిందీ సబ్జెక్టుకు అభ్యర్థులెవరూ రాలేదని తెలిపారు.

గ్రామాలలో వైద్యశిబిరాలు ఏర్పాటు

దాచేపల్లి, ఆగస్టు 30: గ్రామాలలో విషజ్వరాలు ప్రబలడంతో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఉచిత సేవా కేంద్రాలను ఏర్పాటు చేసి మందులు పంపిణీ చేస్తున్నారు. శుక్రవారం భట్రుపాలెం, కాట్రపాడు, తక్కెళ్లపాడు, నారాయణపురం గ్రామాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేశారు. వర్షాలతో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ కార్యక్రమాల్లో డాక్టర్ షహీనా సుల్తానా, మధు, హెల్త్ సూపర్‌వైజర్లు లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి వాడ వాడలా సంబరాలు

● టీడీపీ శ్రేణులు పాల్గొనాలని ఎమ్మెల్యే కన్నా పిలుపు

సత్తెనపల్లి, ఆగస్టు 30: టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు మొదటిసారిగా ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టి సెప్టెంబరు 1వ తేదీతో 29 సంవత్సరాలు పూర్తవుతున్నందున పార్టీ శ్రేణులు వాడ వాడలా సంబరాలకు సిద్ధం కావాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పిలుపు నిచ్చారు. నాడు మొదలైన చారిత్రాత్మక ప్రగతి ప్రయాణం 30 సంవత్సరంలోకి అడుగు పెడుతుందన్నారు. తెలుగు ప్రజల జీవిత గమనాన్ని ప్రగతి మలుపు తిప్పిన పాలకుడు నారా చంద్రబాబు నాయుడు అని కన్నా కీర్తించారు.

హత్యాయత్నం కేసులో ఇద్దరు అరెస్టు

రెంటచింతల,ఆగస్టు30: మండలంలోని రెంటాలగ్రామంలో ఈనెల 23న మద్యం షాపు వద్ద ఏర్పడిన వివాదంలో అంజిరెడ్డిపై దాడి చేసిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ సీహెచ్ నాగార్జున తెలిపారు. శుక్రవారం నిందితులైన ఎం.జనార్ధనరెడ్డి, జీ.చెన్నారెడ్డిలను గురజాల ఏజేసీ కోర్టులో హాజరుపర్చగా మేజిస్ట్రేట్ అలేఖ్య వారికి 14 రోజుల రిమాండ్ విధించినట్లు పేర్కొన్నారు.

పంట కోత ప్రయోగంపై శిక్షణ

నకరికల్లు, ఆగస్టు 30 : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం గ్రామ వ్యవసాయ సహాయకులకు పంటకోత ప్రయోగంపై రైతులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఎస్‌వో కే.కోటేశ్వరరావు, ఏవో కే.దేవదాసు, వ్యవసాయ, ఉద్యానసహాయకులు పాల్గొన్నారు.

నేడు కౌన్సిల్ సమావేశం

సత్తెనపల్లి, ఆగస్టు 30: సత్తెనపల్లి మునిసిపల్ కౌన్సిల్ సమావేశం శనివారం జరుగుతుందని మునిసిపల్ చైర్‌పర్సన్ చలంచర్ల లక్ష్మీ తులసీ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కౌన్సిల్ సభ్యులంతా సమావేశానికి హాజరు కావాలని ఆమె కోరారు.

రేపు ఫుట్‌బాల్ జట్ల ఎంపిక

సత్తెనపల్లి, ఆగస్టు 30 : పల్నాడుజిల్లా బాల బాలికల ఫుట్ బాల్ జట్ల ఎంపికను సెప్టెంబరు 1న సత్తెనపల్లి పట్టణం, సుగాలీకాలనీలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో చేపట్టనున్నట్లు పల్నాడుజిల్లా ఫుట్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి కే.సుబ్రహ్మణ్యేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు ఆదివారం ఉదయం 9 గంటలకు వారి ఒరిజనల్ ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రం జిరాక్సు పత్రం, నాలుగు పాసు పోర్టు సైజు ఫోటోలతో హాజరు కావాలని సూచించారు.

15లోగా పంట నమోదు పూర్తి చేయాలి

నకరికల్లు, ఆగసు 30 : మండల పరిధిలోని గ్రామాల్లో రైతుల పంట నమోదును సెప్టెంబరు 15వ తేదీ లోగా పూర్తిచేయాలని ఏవో కే.దేవదాసు శుక్రవారం ఒక ప్రకటనలో స్థానిక వ్యవసాయ అధికారులు, సహాయకులను ఆదేశించారు. పంట నమోదు చేయించుకొనే రైతులు రైతు సేవా కేంద్రాల్లో తమ ఆధార్ కార్డు జిరాక్స్‌ను, 1బీని, బ్యాంకు ఎకౌంట్ జిరాక్స్‌ను అందజేయాలన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల అందజేత

మాచర్లటౌన్, ఆగస్టు 30: పట్టణంలోని జెండా చెట్టు వద్ద గల ఉర్దూ పాఠశాలలోని విద్యార్థులకు శుక్రవారం అబ్దుల్ కలాం సేవా సమితి ఆధ్వర్యాన నోటు పుస్తకాలు, పరీక్ష ప్యాడ్‌లను అందజేశారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఎంఈవో అల్లి సురేష్ చేతుల మీదుగా ఈ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్దుల్ కలాం సేవా సమితి వ్యవస్థాపకుడు పాషావలి చేస్తున్న సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ జలీల్, మదార్‌సాహెబ్, మస్తాన్‌వలి, పఠాన్ బాబుఖాన్ తదితరులు పాల్గొన్నారు.



భూసార పరీక్షలపై అవగాహన కల్పిస్తున్న సైంటిస్ట్ డాక్టర్ బ్రజేంద్ర

భూసార పరీక్షలపై అవగాహన

పిడుగురాళ్ల, ఆగస్టు 30: ఇ-మిర్చా 2.0 ప్రాజెక్టులో భాగంగా డిజిటల్ గ్రీన్, స్వచ్ఛంద సంస్థ, ఉద్యానవనశాఖ సౌజన్యంతో బిల్ అండ్‌మెలిండా గేట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం జూలకల్లులో భూసార పరీక్షలు, టెస్టింగ్ కిట్స్‌పై రైతులకు అవగాహన కల్పించారు. హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ సురేఖ, ప్రిన్సిపాల్ సైంటిస్ట్ డాక్టర్ బ్రజేంద్ర భూసార పరీక్షలు, కిట్స్ ఉపయోగించే విధానంపై రైతులకు వివరించారు. ఉద్యానవనశాఖ పల్నాడు జిల్లా అధికారి అశోక్‌రెడ్డి, మోహన్, సురేష్, రైతులు పాల్గొన్నారు.



మాచర్ల పట్టణంలోని 30వ వార్డులో పొంగిపొర్లుతున్న మురుగునీరు

మాచర్ల నియోజకవర్గంలో భారీ వర్షం

● పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు జలమయం

మాచర్లటౌన్, ఆగస్టు 30: మాచర్ల నియోజకవర్గ పరిధిలో గురువారం రాత్రి నుంచి శుక్రవారం సాయంత్రం వరకు వర్షం పడుతూనే ఉంది. దీంతో మాచర్ల పట్టణంలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. సైడు కాలువల్లో పూడిక తీయకపోవడంతో వర్షపు నీరు వీధుల్లో రహదారులపై ప్రవహించింది. పలుచోట్ల గృహాల్లోకి మురుగునీరు చేరింది. ప్రధానంగా 13, 14, 15, 16, 30 వార్డుల్లో బజారులలో వర్షపునీటితోపాటు మురుగునీరు ప్రవహించడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. కాగా మాచర్ల మండలంలో 42 మి.మీలు, వెల్దుర్తిలో 24.6 మి.మీ.లు, రెంటచింతలలో 26.4 మి.మీ.లు, దుర్గిలో 25.8 మి.మీ.లు, కారంపూడి మండలంలో 22.4 మి.మీ.ల వర్షపాతం నమోదైంది. పది రోజులుగా ఎండలు, ఈదురు గాలులతో మిర్చి నారు వడపడుతుండడంతో ఈ వర్షం ఊపిరి పోసింది. అలాగే పత్తి, కంది, అపరాల సాగుకు మేలు చేసినట్లయింది. దీంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

నేడే పింఛన్ల పంపిణీ

● పాల్గొననున్న ఆయా ప్రాంతాల ప్రజా ప్రతినిధులు, అధికారులు

రెంటచింతల,ఆగస్టు 30: ఎన్టీఆర్ సామాజిక పింఛన్లను శనివారం పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో వై.మహాలక్ష్మీ తెలపారు. లబ్ధిదారులంతా ఇళ్ల వద్దనే ఉండాలని సూచించారు. మండలంలోని 11 గ్రామాల్లో పింఛన్ల పొందే వారి సంఖ్య 7126 మంది వరకు ఉందని తెలిపారు.

పిడుగురాళ్ల: పట్టణ, గ్రామాలలో శనివారం పింఛన్ల పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎంపీడీవో జీ.కాశయ్య, కమిషనర్ పర్వతనేని శ్రీధర్‌లు తెలిపారు. శుక్రవారమే బ్యాంకు నుంచి నగదు డ్రా చేసి పంపిణీ అధికారులకు అందజేశామన్నారు. శనివారం ఉదయం 5 గంటల నుంచే పింఛన్‌దారులకు ఇంటివద్దనే నగదు అందజేయనున్నట్లు వారు తెలిపారు.

పట్టణంలోని 5,6 వార్డుల్లో జరిగే పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పిడుగురాళ్ల పాల్గొననున్నట్లు పట్టణ పార్టీ అధ్యక్షుడు పాండురంగ శ్రీను తెలిపారు.

బెల్లంకొండ: మండలంలోని చంద్రాజుపాలెం గ్రామంలో శనివారం నిర్వహించే పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పాల్గొంటున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు నల్లమేకల లక్ష్మీనారాయణ తెలిపారు. మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

క్రోసూరు: మండలంలో పింఛన్ల పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎంపీడీవో బిక్కి మహేష్‌బాబు తెలిపారు. శనివారం ఉదయం 6 గంటల నుంచి మండలంలోని 15 గ్రామ సచివాలయాల పరిధిలో ఉద్యోగులందరూ ఇంటింటికి తిరిగి పింఛన్లను పంపిణీ చేస్తారన్నారు. మండలంలో మొత్తం 8,680 ఫెన్షన్‌దారులు ఉన్నారని, వివిధ క్యాటగిరిల ద్వారా రూ. 3,69,71,000 ఫెన్షన్‌ల పంపిణీ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

పెదకూరపాడు: శనివారం జరిగే ఎన్‌టీఆర్ భరోసా పింఛన్‌ల పంపిణీ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సచివాలయ సిబ్బందితో కలసి పాల్గొనాలని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. మండల పార్టీ, గ్రామ పార్టీ అధ్యక్షులు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జిలు, పలు పదవుల్లో ఉన్న నాయకులు ఆయా సచివాలయ పరిధిలో ఇంటింటికి వెళ్ళి పింఛన్‌లు పంపిణీ చేయాలని సూచించారు.



హిందీ ఉపాధ్యాయుడు అబ్దుల్ రజాక్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ

అబ్దుల్ రజాక్ సేవలు ప్రశంసనీయం

సత్తెనపల్లి, ఆగస్టు 30 : హిందీ ఉపాధ్యాయుడిగా 43 సంవత్సరాలుగా పని చేస్తూ ఎంతో మంది విద్యార్థులను అబ్దుల్ రజాక్ తీర్చిదిద్దారని, ఆయన సేవలు ప్రశంసనీయమని ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ అన్నారు. పట్టణంలోని సుగాలీ కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న షేక్ అబ్దుల్ రజాక్ ఉద్యోగ విరమణ సందర్భంగా శుక్రవారం ఆయనకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో పాల్గొన్న రామకృష్ణ మాట్లాడుతూ సత్తెనపల్లి ప్రాంతంలో అబ్దుల్ రజాక్ వద్ద విద్యను అభ్యసించిన ఎంతో మంది విద్యార్థులు నేడు ఉపాధ్యాయులుగా కొనసాగుతున్నారన్నారు. ఈ సందర్భంగా రజాక్ బంధువులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు, ఉపాధ్యాయులు అబ్దుల్ రజాక్ దంపతులను పూలమాలలు, శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు.

ఓపీఎస్‌ను అమలు చేయాలి

పిడుగురాళ్ల, ఆగస్టు 30: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 2004 జనవరి నుంచి సీపీఎస్‌ను అమలు చేస్తున్నాయని, దానిస్థానంలో ఓపీఎస్‌ను అమలు చేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జీ.విజయసారథి డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం పిడుగురాళ్ల యూటీఎఫ్‌శాఖ నేతలు డిప్యూటీ తహసీల్దారు ఎన్.సరోజను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఖాశిం పీరా, జమాల్, చంద్రశేఖర్, సాంబశివరావు, సాయిబాబా పాల్గొన్నారు.

అచ్చంపేట: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నూతన పింఛన్ విధానంలో చాలా లోపాలు ఉన్నాయని, లోప భూయిష్టమైన ఆ విధానాన్ని రద్దుచేసి పాత పింఛన్ విధానాన్నే ఉద్యోగ, ఉపాధ్యాయులకు అమలు చేయా లని యూటీఎఫ్ మండల అధ్యక్షుడు అళ్ళమూరి వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి షేక్ మహబూబ్‌బాషాలు శుక్రవారం ఒక ప్రటకటనలో ప్రభుత్వాన్ని కోరారు. అసంబద్ధ పని సర్దుబాటును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సత్తెనపల్లిలో జరిగిన ధర్నాలో వారు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ

క్రోసూరు, ఆగస్టు 30 : మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్య మవుతుందని మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ కాంద్రు కాశయ్య అన్నారు. వన మహోత్సవం సందర్భంగా శుక్రవారం క్రోసూరు హైస్కూల్‌తో పాటు పలు కార్యాలయాల ఆవరణల్లో టీడీపీ నేతలు మొక్కలు నాటారు.

మాచర్ల రూరల్: మండలంలోని విజయపురిసౌత్ ప్రభుత్వోన్నత పాఠశాలలో శుక్రవారం వనం మనం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎస్ఎంసీ చైర్మన్ రామ్‌చందు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని రక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం ఉప్పలూరి లక్ష్మీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణమాస పూజలు



కారంపూడిలో అమ్మవారికి బోనాలు తీసుకొస్తున్న మహిళలు

పిడుగురాళ్ల, ఆగస్టు 30 : శ్రావణమాసం శుక్రవారం పురస్కరించుకొని పలు దేవాలయాల్లో శ్రావణమాస పూజలు నిర్వహించారు. స్థానిక గంగమ్మతల్లి, కనకదుర్గ అమ్మవారి, చిన అగ్రహారం గ్రామంలో వేంచేసియున్న గంగా పార్వతి సమేత చంద్రమౌళేశ్వర స్వామి ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు.

సత్తెనపల్లి: పట్టణంలోని మహారాష్ట్ర వీధిలో నెలకొన్న శ్రీభక్తాంజనేయ స్వామి దేవాలయం, వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆయలాల్లో మహిళలు పూజలు నిర్వహించారు.

దుర్గి: మండలంలోని ఆత్మకూరులో కనకదుర్గమ్మ అమ్మవారి తిరునాళ్ల మహోత్సవం నిర్వహించారు. మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో బ్యంగా లింగయ్య, అచ్చయ్య, పేరి వెంకటేశ్వర్లు, బచ్చు చెన్నకేశవరావు, వీడెల లచ్చయ్య పాల్గొన్నారు.



వెండి అలంకరణలో పిడుగురాళ్ల గంగమ్మతల్లి

కారంపూడి: పట్టణంలోని వీర్ల అంకాళమ్మ అమ్మవారికి నాయీ బ్రాహ్మణసంఘం ఆధ్వర్యంలో బోనాలు సమర్పించారు. కుంకుమ బండ్లు కట్టి మొక్కులు తీర్చుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాల నడుమ మహిళలు బోనాలతో వచ్చి అమ్మవారికి పొంగళ్లు సమర్పించారు.



సత్తెనపల్లి శ్రీ భక్తాంజనేయ స్వామి దేవాలయంలో..

మాచవరం: మండలంలోని మోర్జంపాడు శివారు బుగ్గమల్లేశ్వరస్వామి దేవాలయం, మాచవరం, పిన్నెల్లి, వేమవరం, పిల్లుట్ల, మల్లవోలు తదితర గ్రామాలలోని ఆలయాల్లో మహిళలు శ్రావణమాసం చివరి శుక్రవారం సందర్భంగా పూజలు నిర్వహించారు.

దాచేపల్లి: దాచేపల్లిలోని వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారు, అంకమ్మతల్లి దేవాలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో మహిళలు 108 రకాల పిండి వంటలతో పండ్లు, పూలతో అమ్మవారికి నివేదన అందజేశారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

● కమిషనర్ సుభాష్ చంద్రబోస్

వినుకొండ టౌన్, ఆగస్టు 30: అల్పపీడన ప్రభావంతో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ శుక్రవారం ఒకప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మూడు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని, లోతట్టు ప్రాంతాల్లోని పిల్లలు, పెద్దలు అత్యవసర సమయంలో మాత్రమే ఇంటి నుంచి బయటకు రావాలని సూచించారు. అదేవిధంగా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రతిఒక్కరూ కాచిచల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని, వేడి ఆహార పదార్థాలు మాత్రమే భుజించాలని, బయట లభించే తినుబండారాలను తీసుకోకుండా, ఆరోగ్యంగా ఉండాలని ఉండాలని కమిషనర్ సూచించారు.

నేడు మున్సిపల్ సాధారణ సమావేశం

వినుకొండ, ఆగస్టు 30: స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో శనివారం మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ సుభాష్ చంద్రబోస్ శుక్రవారం ఒక ప్రకటణలో తెలిపారు. సమావేశానికి వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్లు, అధికారుల తప్పనిసరిగా సమావేశానికి హాజరు కావాలని కోరారు.



రెవెన్యూ మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, ముప్పాళ్ళ నాగేశ్వరరావు

ఆజాద్ నగర్ వాసులకు మౌలిక వసతులు కల్పించాలి

● రెవిన్యూ మంత్రికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ వినతి

వినుకొండ, ఆగస్టు 30: వినుకొండ పట్టణంలోని ఆజాద్ కాలనీ వాసులకు మౌలిక వసతులు కల్పించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను రాష్ట్ర సచివాలయంలో కలిసి శుక్రవారం వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ వినుకొండ నియోజకవర్గంలో ఇళ్లులేని నిరుపేదలకు అన్యాక్రాంతమైన ఆజాద్ నగర్‌లో భూపోరాటంలో భాగంగా 2006లో నిరుపేదలకు సుమారు 6000వేల మందికి ఇళ్ల పంపిణీ చేశామని, సుమారు 19 సంవత్సరాల క్రితం ఆజాద్ నగర్‌లో నిరుపేదలు ఇల్లు నిర్మించుకుని జీవనం సాగిస్తున్నారని, నేటికీ వారికి సరైన మౌలిక సౌకర్యాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఎన్డీఏ ప్రభుత్వం హయాంలోనైనా స్థానికంగా జీవనం సాగిస్తున్న నిరుపేదలకు కరెంటు, తాగునీరు, సీసీ రోడ్లు ఏర్పాటు చేయాలని మంత్రిని కోరామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గం సీపీఐ కార్యదర్శి బూదాల శ్రీను, రైతు సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి ఉలవలపూడి రాము. మల్లిఖార్జునరావు తదితరులు మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మొక్కలు నాటాలి

● చైర్మన్ డాక్టర్ దస్తగిరి

వినుకొండ టౌన్, ఆగస్టు 30: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రారంభించిన వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ఎన్నెస్పి కాలనీ ఆవరణలో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరి చేతుల మీదుగా శుక్రవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా డాక్టర్ దస్తగిరి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని, నాటిన ప్రతి మొక్కను కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ సుభాష్ చంద్రబోస్, ఏఈలు చంద్రశేఖర్, దేవిక, సిబ్బంది పాల్గొన్నారు.

దివ్య రుమటాలజీ సెంటర్ ప్రారంభం



రుమటాలజీ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తదితరులు

నరసరావుపేట లీగల్, ఆగస్టు 30: నరసరావుపేట పట్టణంలోని బ్యాంక్ స్ట్రీట్‌లో గురువారం దివ్య రుమటాలజీ సెంటర్‌ను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో ప్రజలకు ఆధునిక వైద్యసేవలు అందుతున్నాయని అన్నారు. రుమటాలజీ సెంటర్ అధినేత డాక్టర్ మన్నే దివ్య మాట్లాడుతూ అన్ని రకాల కీళ్ల సమస్యలు, స్పాండిలైటిస్, మానని పుండ్లు, అలర్జీలకు అత్యాధునిక చికిత్సలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, దర్శి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, సత్తెనపల్లి టీడీపీ నియోజకవర్గ నాయకుడు నాగోతు శౌరయ్య, పట్టణ వైద్యులు సీ గౌతమి, గౌతమ్, మన్నె రవీంద్ర, ఐఎంఏ నరసరావుపేట అధ్యక్షుడు డాక్టర్ నాగోతు ప్రకాష్, కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసరెడ్డి, డాక్టర్ రామలింగారెడ్డి, డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు, డాక్టర్ కొండపల్లి వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

మహిళలను కించపరిచేలా వైసీపీ వ్యవహరించింది

● టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి భీమినేని వందనాదేవి

నరసరావుపేట టౌన్, ఆగస్టు 30: స్వార్థ, వ్యక్తిగత ప్రయోజనాల కోసం వైసీపీ మహిళా లోకాన్ని కించపరిచేలా వ్యవహరించిందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి భీమినేని వందనాదేవి ఆరోపించారు. శుక్రవారం నరసరావుపేటలోని పల్నాడు టీడీపీ కార్యాలయంలో వందనాదేవి మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ళ కాలంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, చివరకు అధికారులు సైతం నవ్యాంధ్రప్రదేశ్‌ను అత్యాచారాంధ్రప్రదేశ్‌గా మార్చారని అన్నారు. మాజీ మంత్రి అంబటి రాంబాబు, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, అవంతి శ్రీనివాస్, తాజాగా వైసీపీ నేత కుక్కల విద్యాసాగర్‌ల ఉదంతాలు చూస్తుంటే వైసీపీ నేతలకు ప్రజాస్వామ్యంపై, మహిళలపై ఉన్న గౌరవరం తేటతెల్లమైందన్నారు. వైసీపీ హయాంలో అన్యాయం జరిగిన ప్రతి మహిళకు న్యాయం చేసేందుకు కూటమి ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు. సమావేశంలో పల్నాడు జిల్లా మహిళా అధ్యక్షురాలు దాసరి ఉదయశ్రీ, జిల్లా నాయకులు పఠాన్ నూర్జహాన్, ముంతాజ్ బేగం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కోదండ రామ స్వామి కల్యాణోత్సవం

వినుకొండ టౌన్, ఆగస్టు 30: పట్టణంలోని శివాలయం ఆవరణలోని కోదండరామస్వామి దేవాలయంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో శ్రీరాముని జన్మనక్షత్రం పునర్వసు, శ్రావణ శుక్రవారం సందర్భంగా స్వామివారి కల్యాణ మహోత్సం కార్యక్రమాన్ని వేదపండితుల మంత్రోచ్చరణతో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామికి సుదర్శన హోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం, భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు. కార్యక్రమంలో సత్సంగసభ్యులు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



శావల్యాపురం పోలీసు స్టేషన్‌లో

ఎస్పీ ఆకస్మిక తనిఖీ



శావల్యాపురంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

శావల్యాపురం, ఆగస్టు 30: శావల్యాపురం పోలీస్‌స్టేషన్‌ను జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీచేశారు. పోలీస్‌స్టేషన్ రికార్డులు, స్టేషన్ నిర్వహణ, సిబ్బంది పనితీరు, కేసుల దర్యాప్తు, కేసుల పురోగతి, పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాలను భక్తులు నిబంధలనలకు అనుగుణంగా ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. వినాయక చవితి వేడుకలకు సంబంధించి ప్రభుత్వం ప్రత్యేక యాప్‌ను రూపొందించిందని, గ్రామాల్లో వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసుకొనదలచినవారు యాప్‌లోనే దరఖాస్తు చేసుకోవాలని, రెండ్రోజుల వ్యవధిలో యాప్‌ను ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు. సమస్యాత్మక గ్రామాల్లో వినాయక చవితి వేడుకలు జరుపుకోవాలంటే ఇరువర్గాలకు చెందిన నాయకులతో సమావేశాన్ని నిర్వహించి, సీసీ కెమేరాల పర్యవేక్షణలో వినాయక చవితి వేడుకలు జరిగేలా చర్యలు చేపడతామన్నారు. మండలంలో సమస్యాత్మక గ్రామాలైన వేల్పూరు, కారుమంచి గ్రామాల్లో ఎక్కువగా పర్యవేక్షణ చేయాలని ఎస్ఐ లేళ్ళ లోకేశ్వరరావును ఆదేశించారు. వినాయక చవితి నిర్వాహకులు యాప్‌లో దరఖాస్తు చేసుకోగానే ఆధారాలను పరిశీలించి స్థానిక పోలీసులు అనుమతులు మంజూరు చేస్తారన్నారు. గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిని ఉపేక్షించేది లేదని, అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొంటామన్నారు. గ్రామాలలో ద్విచక్రవాహనాలు చోరీకి గురవుతున్నాయని, ఎస్పీ దృష్టికి తీసుకెళ్ళగా గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటుచేసి చోరీలు అరికట్టాలని సిబ్బందికి సూచించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో సిబ్బంది మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని, సమస్యలు తెలుసుకొని త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్బీ సీఐ సురేష్, వినుకొండ పట్టణ సీఐ శోభన్‌బాబు, సిబ్బంది సలామ్, ప్రదీప్, ఇమ్రాన్, శ్రీకాంత్, రత్నం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రావణ శుక్రవారం పూజలు



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీతిరుపతమ్మ, కామాక్షి అమ్మవారు

శావల్యాపురం, ఆగస్టు 30: శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకొని మండలంలోని కారుమంచి, మతుకుమల్లి, బొందిలిపాలెం, శావల్యాపురం, పోట్లూరు, గంటవారిపాలెం, వేల్పూరు తదితర గ్రామాల్లోని దేవాలయాల్లో మహిళలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు అమ్మవార్లకు పాలాభిషేకాలు, క్షీరాభిషేకాలు నిర్వహించి నూతన వస్త్రాలు, పూలమాలలతో ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం అర్చనలు, అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించి అమ్మవారికి చీరెసారెలను కానుకగా సమర్పించారు. పోట్లూరు పంచాయతీ పరిధిలోని అద్దంకి బ్రాంచ్ కెనాల్ ఉన్న గోపయ్య సమేత శ్రీలక్ష్మీ తిరుపతమ్మ దేవాలయంలో అమ్మవారికి నిమ్మకాయలతో ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశారు. పూజారి శ్రీనివాసరావు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేయగా ధర్మకర్త గోనుగుంట్ల వెంకట్రావు, కమిటీ సభ్యులు ప్రసాదాలను పంపిణీ చేశారు.

● రొంపిచర్ల: మండలంలోని రొంపిచర్ల, విప్పర్ల, వడ్లమూడివారిపాలెం, సంతగుడిపాడు, గోగులపాడు గ్రామాల్లోని వాసవి, చౌడేశ్వరి, శంకర స్వామి, నీలకంఠేశ్వరస్వామి, వల్లభేశ్వరస్వామి ఆలయాల్లో శ్రావణ మాసం నాలుగో శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు పూజా కార్యక్రమాలు జరిగాయి. విశేష పూజల అనంతరం అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. కుంకుమ పూజల్లో మహిళలు పాల్గొన్నారు.

సామూహిక వరలక్ష్మి వ్రతపూజలు

ఇసప్పాలెం (నరసరావుపేట రూరల్), ఆగస్టు 30: మండలంలోని ఇసప్పాలెంలోని మహంకాళి ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా దేవదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మి వ్రత పూజలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో 125మంది మహిళలు పాల్గొని గణపతిపూజ, అమ్మవారికి అష్టోత్తర కుంకుమార్చన, వరలక్ష్మి వ్రతం తదితర కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. పూజల్లో పాల్గొన్న మహిళలకు పూజా ద్రవ్యాలు, శేషవస్త్రాలు, తీర్థ ప్రసాదాలను అందజేసినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి టి.సుధాకరరెడ్డి తెలిపారు.



ఇసప్పాలెం మహంకాళి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు, వరలక్ష్మి వ్రత పూజల్లో పాల్గొన్న మహిళలు

బాలకృష్ణ 50ఏళ్ళ సినీ ప్రస్థానంపై వేడుకలు



కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట అర్బన్, ఆగస్టు 30: సినీ హీరో నందమూరి బాలకృష్ణ 50 ఏళ్ళ సినీ ప్రస్థానం నవరస భరితం అంటూ మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు బాలకృష్ణకు శుభాకాంక్షలు తెలియ జేశారు. బాలకృష్ణ 50 సంవత్సరాల నట ప్రస్థానం సందర్భంగా ఆయన అభిమాన సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కేక్‌ను ఎమ్మెల్యే ప్రత్తిపాటి కట్ చేశారు. తాతమ్మకల సినిమాతో చిత్ర పరిశ్రమలోకి అడుగు పెట్టిన బాలకృష్ణ ఎన్నో హిట్ చిత్రాలు అందించారని ప్రత్తిపాటి కొనియాడారు. నటుడిగా ఒక ప్రత్యేక స్థానాన్ని, హిందూపురం ఎమ్మెల్యేగా రాజకీయరంగం పైన, బసవతారకం క్యాన్సర్ హాస్పటల్ చైర్మన్‌గా, సేవా రంగంపైన తనదైన ముద్ర వేశారని ప్రత్తిపాటి కొనియాడారు.

స్విమ్మింగ్ పోటీలకు ఎస్ఎస్ఎన్ విద్యార్థి



ఎస్ జగదీష్

నరసరావుపేట టౌన్, ఆగస్టు 30: స్థానిక ఎస్ఎస్ఎన్ కళాశాల విద్యార్థి ఎస్ జగదీష్ జాతీయ సీనియర్స్ ఆక్వాటిక్ స్విమ్మింగ్ ఛాంపియన్ షిప్ 2024 పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ డాక్టర్ మువ్వల సుబ్రహ్మణ్య సుధీర్ శుక్రవారం తెలిపారు. కర్నాటక రాష్ట్రం మంగుళూరులోని ఎమ్మెకరే మైదానంలో జరిగే 77వ సీనియర్స్ ఆక్వాటిక్ స్విమ్మింగ్ పోటీలలో ఏపీ టీమ్ తరపున ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు.

ఘనంగా శ్రీమహాలక్ష్మి పౌండరీక మహాయాగం

నరసరావుపేట రూరల్, ఆగస్టు 30: పట్టణంలోని సత్తెనపల్లి రోడ్డులోని అయ్యప్పస్వామి దేవస్థానంలో క్షేత్రపాలకుడిగా ఉన్న పంచముఖ ఆంజనేయస్వామి దేవస్థానంలో 108సార్లు శ్రీసూక్త పారాయణసహిత శ్రీమహాలక్ష్మి పౌండరీక మహాయాగం శుక్రవారం ఉదయం ఘనంగా నిర్వహించారు. పట్టణానికి చెందిన 25 మంది దంపతుల చేత ఈ మహాయాగం ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకుని మహాయాగంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ కొత్తూరి గోపి, కార్యదర్శి చేబ్రోలు ఫణికుమార్, కోశాధికారి మైలవరపు ధనుంజయరావు, చేగు వెంకటేశ్వరరావు, కొత్తూరి ప్రసాదరావు, నారాయణ వెంకట హనుమంతచార్యులు, నారాయణమ్ సందీప్‌కుమార్ దీక్షితులు, వాడపల్లి హైమాచార్యులు, నారాయణ సత్యనారాయణ ప్రదీప్, నారాయణ రామ్మోహన్, వేదాంతం రంగనాథ చక్రవర్తి, పూదాంతం విష్ణుప్రణీతి తదితరులు పాల్గొన్నారు.

డ్యాకుమెంట్ రైటర్‌పై మున్సిపల్ ఉద్యోగి దాడి

నరసరావుపేట లీగల్, ఆగస్టు 30: స్వల్ప వివాదం నేపథ్యంలో ఓ మున్సిపల్ ఉద్యోగి డాక్యుమెంట్ రైటర్‌పై దాడిచేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శుక్రవారం మొదటి పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 24న నరసరావుపేట మున్సిపాలిటీలో ఉద్యోగ సేవలు అందిస్తున్న సంగమేశ్వరరావు రిజిస్టర్ కార్యాలయం వద్ద డాక్యుమెంట్ రైటర్ ఆచారిపై దాడి చేశారు. ఈ మేరకు ఆచారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు నమోదు చేసిన పోలీసులు కోర్టు అనుమతితో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



విద్యార్థులు, అధ్యాపకులతో ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు తదితరులు

విద్యార్థి దశలో కష్టపడి చదువుకోవాలి

● ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట టౌన్, ఆగస్టు 30: విద్యార్థి దశలో చేసిన కష్టమే జీవితాంతం సుఖవంతమైన జీవితాన్ని అందిస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. శుక్రవారం నరసరావుపేటలోని జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో మీట్‌విత్ స్టూడెంట్స్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ చాలా మంది పేద కుటుంబాల నుంచి వచ్చిన వారే ఉన్నారని, ప్రతి విద్యార్థి రోజులో ఒక్కసారైనా తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తుచేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జేఎన్‌టీయూ కాకినాడ ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సీహెచ్ శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏఎన్‌యూ బోర్డు సభ్యుడిగా డాక్టర్ యోగేశ్వరరావు

నరసరావుపేట టౌన్, ఆగస్టు 30: స్థానిక కృష్ణవేణి డిగ్రీ కళాశాల రసాయనశాస్త్ర విభాగంలో పనిచేస్తున్న డాక్టర్ డీ యోగేశ్వరరావును ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో రసాయశాస్త్రంలో బోర్డు ఆఫ్ స్టడీస్ సభ్యుడిగా నియమితులయ్యారని ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. డాక్టర్ డీ యోగేశ్వరరావు మాట్లాడుతూ రసాయశాస్త్రంలో సిలబస్‌లో మార్పులకు, పరీక్ష విధానం, కొత్త కోర్సులకు సలహాలు, సూచనలు, సంప్రదింపులకు బోర్డు సభ్యుడిగా నియమితులైనట్లు తెలిపారు. డాక్టర్ డీ యోగేశ్వరరావును ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ కే నాసరయ్య, ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, అధ్యాపకులు ఘనంగా సత్కరించారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు భాషాదినోత్సవం

నరసరావుపేట కల్చరల్, ఆగస్టు, 30. పట్టణంలోని స్థానిక ఎస్.బి.టి., ఎస్.వి.సి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా వినుకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు శాఖ ఆచార్యులు జి.స్వర్ణలత హాజరయ్యారు. కళాశాల తెలుగు శాఖ అధ్యక్షుడు డాక్టర్ కాకాణి సుధాకర్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఆంగ్లశాఖ అధ్యాపకులు శ్రీనివాసరావు, రాజనీతి శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ దీపలు పాల్గొన్నారు. సభ అనంతరం ఆచార్యులు స్వర్ణలతను సన్మానించారు.

సుబ్బయ్యపాలెంలో వైద్య శిబిరం

రొంపిచర్ల, ఆగస్టు 30: మండలంలోని సుబ్బయ్యపాలెంలో రొంపిచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్యాధికారి సాయి బాబు వైద్య పరీక్షలు నిర్వహించారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో ఈ శిబిరాన్ని నిర్వహించినట్లు ఆయన తెలిపారు. సాధారణ జ్వరాలు ఉన్నట్లు ఆయన తెలిపారు. మొత్తం 83 మందిని పరీక్షించారు. ఎనిమిది మందికి సాధారణ జ్వరాలు ఉన్నట్లు తెలిపారు.

మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన

నరసరావుపేట టౌన్, ఆగస్టు 30: స్థానిక ఏఎంరెడ్డి విద్యాసంస్థలలో శుక్రవారం మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాన సదస్సు జరిగింది. ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీ భార్గవ భూషణ రావు, ఇంజనీరింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ మల్లికార్జున్, డిప్లమో ప్రిన్సిపాల్ డాక్టర్ కే కృష్ణారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీలో చేరేందుకు విద్యార్థుల ఆసక్తి

నరసరావుపేట కల్చరల్, ఆగస్టు, 30. నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్‌సీసీలో చేరేందుకు విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఆసక్తి చూపారు. శుక్రవారం 23వ ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ గౌతమ్‌కుమార్ ఎంపికలు నిర్వహించారు. 400మంది విద్యార్థులు హాజరు కాగా, 90మందిని తదుపరి ఇంటర్వ్యూకి ఎంపిక చేశారు.

సంతగుడిపాడులో కుక్క దాడి... పది మందికి గాయాలు

రొంపిచర్ల, ఆగస్టు 30: మండలంలోని సంతగుడిపాడులో కుక్క దాడి చేయటంతో పది మందికి గాయాలైన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామంలోని చెన్నారెడ్డి రంగమ్మ, వెంకటరత్నం, విజయ నిర్మల, కొండమ్మ, రసూల్, ఆకాష్, పార్వతి, వెంకటేశ్వర్లు, సీతమ్మలను కుక్క కరిచింది. దీంతో చికిత్స కోసం వీరు రెడ్డిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లారు. వీరిలో ఇద్దరిని ఇద్దరిని నరసరావుపేట ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స కోసం రిఫర్ చేశారు.

చిలకలూరిపేట మున్సిపల్ కమిషనర్‌గా హరిబాబు

చిలకలూరిపేట, ఆగస్టు 30: చిలకలూరిపేట మునిసిపల్ కమిషనర్‌గా పి.హరిబాబు నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన అనంతపురం మునిసిపల్ కార్పొరేషన్‌లో డిప్యూటీ కమిషనర్‌గా ఉన్నారు. చిలకలూరిపేటకు బదిలీ అయ్యారు. ఇక్కడ కమిషనర్‌గా డెప్యుటేషన్ ప్రాతిపదికన పనిచేస్తున్న సీహెచ్ గోవిందరావును ఏపీ సెక్రటేరియట్‌కు తదుపరి పోస్టింగ్ కోసం పంపారు. కొత్త కమిషనర్ హరిబాబు ఒకటి రెండు రోజులలో బాధ్యతలు స్వీకరించవచ్చునని తెలిసింది.

జేఎన్‌టీయూలో మొక్కలు నాటిన అటవీ బలగాల అధిపతి



జేఎన్‌టీయూ కళాశాలలో మొక్కలు నాటుతున్న అటవీ బలగాల అధిపతి చౌదరి

నరసరావుపేట, ఆగస్టు 30: నరసరావుపేట మండలం కాకాని జెఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో అటవీ బలగాల అధిపతి చిరంజీవి చౌదరి వనమహోత్సవంలో శుక్రవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన కళాశాలలో మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరు వారి తల్లి పేరు మీద ఒక మొక్క నాటి పెంచాలని చౌదరి కోరారు. కార్యక్రమంలో జిల్లా ఆటవీ శాఖ అధికారి రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి పింఛన్ల పంపిణీలో నాయకులు పాల్గొనాలి

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్

నరసరావుపేట టౌన్, ఆగస్టు 30: పింఛన్ల పంపిణీ సెప్టెంబరు 1న ఆదివారం కావడంతో ఒకరోజు ముందుగా అంటే ఆగస్టు 31న జరుగుతుందని, కార్యక్రమంలో ప్రతి నాయకుడు సచివాలయ సిబ్బందితో కలిసి పాల్గొనాలని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల, పట్టణ పార్టీ అధ్యక్షుడు, డివిజన్, వార్డు అధ్యక్షుడు, క్లస్టర్, యూనిట్, బూత్, సెక్షన్ ఇన్‌చార్జిలు, ఇతర పదవులలో ఉన్న నాయకులు, ఆయా సచివాలయ పరిధిలో ఇంటింటికి వెళ్ళి పింఛన్లు పంపిణీ చేయాలని పిలుపునిచ్చారు.



డాక్టర్ కందిమళ్లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

డాక్టర్ కందిమళ్ల సేవలు వెలకట్టలేనివి

● శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు


చిలకలూరిపేట, ఆగస్టు 30: తెలుగు నాటక రంగానికి, రంగస్థల కళారంగానికి డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు అందించిన సేవలు వెలకట్టలేనివని మాజీమంత్రి, స్థానిక శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు శుక్రవారం అన్నారు. తెలుగుభాషా వికాసానికి చేసిన కృషికి గాను ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేతుల మీదుగా తెలుగుభాషా పురస్కారం అందుకున్న కందిమళ్లను ప్రత్తిపాటి తన స్వగృహంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. తెలుగుభాష పరిరక్షణకు సామాజిక చైతన్యాన్ని జోడించిన విశేష ప్రతిభాశాలి కందిమళ్ల అని ప్రశంశల జల్లు కురిపించారు. అటువంటి మేధావి తమ గడ్డపై ఉండడం అందరికీ గర్వకారణం అన్నారు. తెలుగు అధ్యాపకులుగా, నాటకరంగ పరిశోధకులుగా, రచయితగా ఆయనకు వేరెవరూ సాటిరారన్నారు. కార్యక్రమంలో చిలకలూరిపేట విద్యా సంఘం అధ్యక్షుడు తేళ్ళ సుబ్బారావు, టీడీపీ కౌన్సిలర్ల గ్రూపు నాయకుడు గంగా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పింఛన్ల పంపిణీ

శావల్యాపురం, ఆగస్టు 30: ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని 11 సచివాలయాల పరిధిలో సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించనున్నట్లు ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య శుక్రవారం తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని 11 సచివాలయాల పరిధిలో 5947మంది పింఛన్ల లబ్ధిదారులుండగా ప్రభుత్వం పింఛన్ల పంపిణీ నిమిత్తం రూ.2,51,73,000లను మంజూరు చేసిందన్నారు. మొత్తం 94మంది సచివాలయ ఉద్యోగులు పింఛను లబ్ధిదారుల ఇంటింటికీ వెళ్ళి పింఛను నగదును అందజేయనున్నారని, అందుబాటులో లేనివారికి సెప్టెంబరు 2వ తేదీన పింఛన్లు అందజేస్తారని తెలిపారు. అనంతరం వనం-మనం కార్యక్రమంలో భాగంగా మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో అధికారులు మొక్కలు నాటారు. ఏపీఎం గుమ్మడిల్లి వాసుబాబు, జేఈ సుధాకర్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు షీల్డ్‌లు అందజేత

వినుకొండ టౌన్, ఆగస్టు 30: జాతీయ క్రీడా దినోత్సవంలో భాగంగా నర్సరావుపేటరోడ్డులోని మహాత్మ జ్యోతీరావుపూలే గురుకుల పాఠశాల క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు పీఈటీ జోనానాయక్ ఆధ్వర్యంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర ప్రసాద్ చేతుల మీదుగా విద్యార్థులకు శుక్రవారం షీల్డులు అందచేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు వెంకటేశ్వర ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లో రాణించాని, క్రీడల్లో ప్రతిభచూపిన విద్యార్థులు పైచదువుల్లో రిజర్వేషన్ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



క్రీడాకారులతో ఏఎంజీ సంస్థ డైరెక్టర్ అరుణ్ కుమార్ కంటి మహంతి

ఏఎంజీ స్కూలుకు రాష్ట్రస్థాయి క్రీడా ప్రతిభా పురస్కారం

చిలకలూరిపేట, ఆగస్టు 30: జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా 2023-24 విద్యా సంవత్సరంలో పాఠశాల క్రీడలలో అత్యంత ప్రతిభ కనబరిచిన ఏఎంజీ స్కూలు విద్యార్థులకు క్రీడా ప్రతిభా పురస్కారాలు దక్కాయి. 963 పాయింట్లు సాధించిన ఏఎంజీ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో మూడో స్థానం, పల్నాడు జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారు. పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా స్కూలులో జరిగిన అభినందన సభలో ఏఎంజీ ఇండియా ఇంటర్నేషనల్ సంస్థ డైరెక్టర్ డాక్టర్ అరుణ్ కుమార్ కంటి మహంతి పాల్గొని క్రీడాకారులను అభినందించారు. పల్నాడు జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు ఖాదర్ మస్తాన్, చిలకలూరిపేట వ్యాయామ ఉపాధ్యాయ సంఘ ప్రెసిడెంట్ కాసిం బుడే, కార్యదర్శి పిలిఫ్ రాజు, సంఘ సభ్యులు సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు వేణు, ఇస్మాయిల్, హైస్కూల్ హెచ్ఎం కె కృపాదానం పాల్గొన్నారు.

సంగం రైతులకు బోనస్‌లు పంపిణీ

శావల్యాపురం, ఆగస్టు 30: పాడిరైతుల సంక్షేమమే లక్ష్యంగా సంగం డెయిరీ వివిధ రకాల రాయితీలు, బోనసులు, ఉచిత పశు వైద్యసేవలను అందిస్తూ వారికి ఎంతో తోడ్పాటునందిస్తుందని వినుకొండ సంగం డెయిరీ డైరెక్టర్ గడిపూడి ఆంజనేయులు అన్నారు. మండలంలోని శానంపూడి, మతుకుమల్లి గ్రామాల్లోని సంగం డెయిరీ మిల్క్‌సెంటర్లలో అధికారులు గురువారం రాత్రి బోనస్‌ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. శానంపూడి ఎంపీసీఎస్ సెంటర్‌లో 46మంది పాలఉత్పత్తిదారులకు రూ.4,50,583, మతుకుమల్లిలోని ఎంపీఐ, బీఎంసీఎల్, సీఎంసీఎల్ సెంటర్లలోని 258మంది పాలఉత్పత్తిదారులకు రూ.15,54,035 బోనస్‌లను అందజేశారు. కార్యక్రమంలో సంగండెయిరీ జనరల్ మేనేజర్ వెంకటేశ్వర ప్రసాద్, సీనియర్ మేనేజర్ ఆదినారాయణ, సెంటర్ల అధ్యక్షుడు ఆవుల వెంకటసుబ్బయ్య, ముండ్రు ప్రభ పచ్చాబ్రహ్మాయ్య రామిశెట్టి వీరాంజనేయులు, సంగం డెయిరీ డాక్టర్‌లు శివరామకృష్ణ ప్రసాద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.